ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు

5

గురువారం 24 ఏప్రిల్ 2025



- పదో తరగతిలో జిల్లా ఉత్తీర్ణత శాతం 65.45
- ఈసారి కూడా బాలికలదే పైచేయి
- బాలికల ఉత్తీర్ణత శాతం 72.21
- బాలుర ఉత్తీర్ణత శాతం 60.36
- జిల్లాలో పెరిగిన పది ఉత్తీర్ణత శాతం

పదిలో సత్తా చాటారు..!

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈసారి కూడా పది ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాలో 25వ స్థానంలోకి పడిపోయింది. గత ఏడాదిని పోల్చుకుంటే జిల్లా ఉత్తీర్ణత శాతం రంటూ 2.98 శాతం అదనంగా పెరిగింది. కర్నూలు జిల్లాలో 512 ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం విద్యార్థులు 31,185 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 20,584 మంది పాసై 65.45 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురు 16320 మంది పరీక్షకు హాజరు కాగా 9854 మంది పాసై 60.36 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే బాలికలు మొత్తం 14,859 మందికిగాను 10,730 మంది పాసై 72.21 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో పది ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే గత ఏడాది కంటే అదనంగా 2.98 ఉత్తీర్ణత శాతం పెరిగింది. గత ఏడాది పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతం 62.47 శాతం కాగా ఈ ఏడాది 65.45 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో కర్నూలు వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాల విద్యార్థిని పాలబండ్ల తన్మయి గాయత్రి 597/600 మార్కులు, కర్నూలు భాస్కర్ నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని పి. గీతిక (పగిడ్యాల) 597మార్కులు, కర్నూలు ఎల్కూరు బంగ్లా నారాయణ పాఠశాల విద్యార్థిని సేగూ వెంకట కీర్తన 597, ఆదోని రూట్ గ్లోబల్ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన దేవనకొండ సలీమ 597 మార్కులు, ఆదోని అక్షరశ్రీ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన కే. గౌతమి నంద 597, ఆదోని భాష్యం హైస్కూల్ నగరూరు హరిని 597 మార్కులు కర్నూలు శ్రీచైతన్య పాఠశాల మాలదాసరి సాయినందిని 596 మార్కులు, రత్నపల్లి మనుచరణ్ 596, అనగాలి నేహ 596, యశస్విని 595, కర్నూలు డా. ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాయి లిఖిత 595 మార్కులు సాధించి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల వారిగా పదో తరగతి ఫలితాలు ఈ విధంగా ఉన్నాయి.

- ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1872 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 951 మంది పాసై 50.80 శాతం ఉత్తీర్ణత సాధించారు. కర్నూలు బీ. క్యాంపు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ అర్షియా మల్లిక 586 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14,419 మంది పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా, 7039 మంది పాసై 48.81 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే మున్సిపాలిటీ యాజమాన్య పాఠశాలలో 1838 మందికి గాను 961 మంది పాసై 52.28 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ యాజమాన్య పాఠశాలలో 9497 మందికి గాను 8647 మంది పాసై 91.04 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏపీ మోడల్ స్కూల్స్‌లో 1333 మందికి గాను 930 మంది పాసై 69.76 శాతం, బీసీ వెల్ఫేర్ పాఠశాలలో 227 మందికి గాను 221 మంది పాసై 97.35 శాతం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 978 మందికి గాను 774 మంది పాసై 79.14 శాతం, ఎయిడెడ్ పాఠశాలలో 187 మందికి గాను 102 మంది పాసై 54 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏపీఆర్ఎస్ పాఠశాలలో 374 మందికి గాను 360 మంది పాసై 96.25 శాతం, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో 544 మందికి గాను 483 మంది పాసై 88.78 శాతం, అలాగే ఏపీటీడబ్ల్యూఎస్ పాఠశాలలో 91 మందికి గాను 61మంది పాసై 65.93 శాతం ఉత్తీర్ణత సాధించారు.

- **సబ్జెక్టుల వారిగా..:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలో సబ్జెక్టుల వారిగా ఉత్తీర్ణతను పరిశీలించినట్లయితే తెలుగు సబ్జెక్టులో 31416 మంది విద్యార్థులకు గాను 28,818 మంది పాసై 91.72 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే హిందీ సబ్జెక్టులో 31405 మందికి గాను 31,113 మంది పాసై 99.08 శాతం, ఇంగ్లీషులో 31.385 మందికిగాను 26,726 మంది పాసై 85.16 శాతం, గణితంలో 31,443 మందికిగాను 23,662 మంది పాసై 75.2 శాతం, పీఎస్ అండ్ బీఎస్‌లో 31,443 మందికి గాను 24,543 మంది పాసై 78 శాతం, సోషల్ స్టడీస్‌లో 31,443 మందికి గాను 26,946 మంది పాసై 85.6 శాతం ఉత్తీర్ణత సాధించారు.

సంవత్సరం	హాజరైన విద్యార్థులు			ఉత్తీర్ణులైన వారు			ఉత్తీర్ణత శాతం		
	బాలురు	బాలికలు	మొత్తం	బాలురు	బాలికలు	మొత్తం	బాలురు	బాలికలు	మొత్తం
2018-19	27407	23384	50791	25125	21655	46780	91.67	92.61	92.1 శాతం
2019-20	28010	24258	52268	28010	24258	52268	100	100	100 శాతం
2020-21	27907	24450	52357	27907	24450	52357	100	100	100 శాతం
2021-22	27302	24367	51669	15010	15059	30069	54.98	61.80	58.20 శాతం
2022-23	15258	13528	28786	8527	8912	17439	55.89	65.88	60.58 శాతం
2023-24	16276	14526	30,802	9313	9929	19,242	57.22	68.35	62.47 శాతం
2024-25	16320	14859	31,185	9854	10,730	20,584	60.36	72.21	65.45 శాతం

● ఆనందంగా ఉంది



పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 597 మార్కులు రావడం సంతోషంగా ఉంది. ఈ మార్కులను ముందే ఊహించా. క్లాస్ టీచర్ ఖాదర్ సలహాలతో పాటు పాఠ్యపుస్తకాలు చదవడం వల్ల మంచి మార్కులు వచ్చాయి. కర్నూలు బాహుజీ నగర్‌లో మేం ఉంటున్నాం. మా తండ్రి మల్లయ్య ఆర్అండ్‌బీలో పని చేస్తారు. తల్లి అర్చన గృహిణి. ఐఐటీలో చేరడమే లక్ష్యం.

- పాలబండ్ల తన్మయి గాయత్రి 597/600

● మెడిసిన్ చదువుతా



597/600 మార్కులు రావడం సంతోషంగా ఉంది. నేను రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో కూడా పాల్గొన్నా. కర్నూలు నంద్యాల చెక్‌పోస్టులో నివాసం. సొంత గ్రామం కల్లూరు మండలం లక్ష్మీపురం. తండ్రి అనిల్ కుమార్. తల్లి వరలక్ష్మి ఇద్దరూ ఉపాధ్యాయులే. మెడిసిన్ చేయడం నా లక్ష్యం.

- పి. గీతిక 597/600

● కష్టమైనా ఇష్టంతోనే చదివాను



కష్టపడి చదవడం వల్లనే మంచి మార్కులు సాధించాను. తండ్రి షణ్ముగ గణేష్ కుమార్ విజిలెన్స్ డిపార్టుమెంటులో పని చేస్తారు. తల్లి మంజూష కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ స్కూల్ అసిస్టెంటుగా పని చేస్తున్నారు. కర్నూలు టీకే సింగ్ టవర్ అయ్యప్పస్వామి గుడి దగ్గర నివాసం. పాఠశాలలోనే ప్రిపరేషన్ జరిగేది. అందువల్లే ఈ మార్కులు సాధించా.

- సేగు వెంకట కీర్తన - 597/600

ఉత్తమ ఫలితాలు -డీఈవో



కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలో 65.45 శాతం విద్యార్థులు పాసయ్యారని అన్నారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించడం వల్ల క్వాలిటీ రిజల్ట్స్ వచ్చాయని అన్నారు. సప్లమెంటరీ పరీక్షలకు ఫీజు ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు చెల్లించాలన్నారు.

కలాం.. సలాం..!

- వందశాతం ఉత్తీర్ణతతో సత్తా
- 33 మందికి 550కి పైగా మార్కులు
- 9 మందికి 500పైగా..
- కర్నూలులో ప్రభుత్వ పాఠశాల ఫలితాలివి..





అత్యధిక మార్కులు సాధించిన టీపీ సాయి లిఖిత (595) శృతి (591)

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మారక మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల వరుసగా నాలుగో ఏడాది కూడా వందశాతం ఉత్తీర్ణతతో పాటు అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అగ్రభాగాన నిలిచింది. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 43 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించడం విశేషం. అందులోనూ సాదాసీదా మార్కులతో కాదు... టాప్ మార్కులతో పాసయ్యారు. 42 మందిలో 33 మందికి 550కి పైగా మార్కులు వచ్చాయి. మరో 9 మందికి 500కు పైగా, ఓ విద్యార్థికి 491 మార్కులు వచ్చాయి. విద్యార్థుల్లో టీపీ సాయి లిఖిత 595 మార్కులతో టాప్‌లో నిలవగా.. శృతి 591, చక్రధర్ 588, హరిణి 586, పార్థసారధి, మేఘన 584, లోషిత 583, కౌశిక్ కుమార్ 582, విష్ణుప్రియ 581, సంజయ్ కుమార్ 580 మార్కులతో సత్తా చాటారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అధ్యాపకులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అభినందించారు.



నగరంలోని అబ్దుల్ కలాం మెమోరియల్ కార్పొరేషన్ హైస్కూల్

మా నాన్న కష్టం గుర్తించి చదివాను

సలీమా, 597/600, దేవనకొండ



మా అమ్మ నాన్న రంజాన్ బాషా. మా ఇంట్లో ముగ్గురం పిల్లలం. నేను పెద్దమ్మాయిని. మా నాన్న కష్టం చూశాను. నాన్న చిరు వ్యాపారం, రియల్ ఎస్టేట్ చేస్తుంటారు. అమ్మ గృహిణి. పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో మంచి టాపర్‌గా నిలవాలని కష్టపడి చదివాను. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించడం వల్ల 597 మార్కులు సాధించగలిగాను. ఇంటర్ ఎంపీసీలో చేరి ఎంబీఏ చదివి వ్యాపారవేత్తగా స్థిరపడాలనే మా నాన్న కలను నెరవేరుస్తాను.

ప్రజలకు మంచి వైద్యం అందిస్తా

- గౌతమినంద, 597/600, ఆదోని



మా నాన్న చంద్రశేఖర్ పత్తి వ్యాపారం చేస్తుంటారు. అమ్మ పరిమళ గృహిణి. మా ఇంట్లో కచ్చితంగా ఒక్కరైనా డాక్టర్ కావాలని అమ్మానాన్నలు ఎప్పుడూ చెబుతుంటారు. అందుకే కష్టపడి చదివాను. సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు సన్నద్ధమై 597 మార్కులు సాధించగలిగాను. బైపీసీలో చేరి నీట్‌లో మంచి ర్యాంకు సాధించి డాక్టర్‌ను అయి ప్రజలకు మంచి వైద్యం అందిస్తాను.

చార్టెడ్ అకౌంటెంట్ అవుతాను

-నగరూరు హరిణి, 597/600, ఆదోని



చిన్నప్పటి నుంచి నాకు మ్యాథమెటిక్స్ అంటే చాలా ఇష్టం. మా అమ్మ పవిత్ర ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నది. నాన్న నవీన్ కుమార్ రెడ్డి చిరు ఉద్యోగం చేస్తున్నారు. అమ్మ టీచర్ కావడం వల్ల చదువు పట్ల అశ్రద్ధ పెట్టలేదు. క్రమశిక్షణ నేర్పింది. కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో స్టేట్ టాపర్‌గా రావడం చాలా సంతోషంగా ఉంది. ఇంటర్మీడియట్‌లో ఎంఈసీ చేరి మంచి చార్టెడ్ అకౌంటెంట్‌గా స్థిరపడతాను.

ఇంజనీర్ కావాలన్నదే లక్ష్యం

● ఎస్ఎండీ సొహైల్ సిద్ధిక్, 597/600, ఎమ్మిగనూరు



స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు



ఇంజనీర్ కావాలన్నదే తన లక్ష్యమని ఎస్ఎండీ సొహైల్ సిద్ధిక్ అన్నారు. మా తల్లిదండ్రులు ఉస్మాన్ గని, నజీయా బేగం సహకారంతోనే 597 మార్కులు సాధించాను. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను ఎప్పటికప్పుడు చదువుతూ, గ్రూప్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యావాడిని.

● మే 19వ తేదీ నుంచి సప్లిమెంటరీ

10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 19వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. 19 వతేదీ నుంచి 28 వతేదీ వరకు పరీక్షలుంటాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

● రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 24వ తేదీ నుంచి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ వెల్లడించింది. రీ కౌంటింగ్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, మే 1వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.

వారెవ్వా... బనవాసి..!

● వందశాతం ఉత్తీర్ణత

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బనవాసి గురుకుల పాఠశాల ఎప్పటిలాగే తన హవాను కొనసాగించింది. వందశాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించారు. పాఠశాలలో మొత్తం 79 మంది విద్యార్థినులు పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులై వంద శాతం నమోదు చేశారు. ఇందులో శ్రావణి 583, నందిని 576, కీర్తన 573, బిందు 570, భాగ్యశ్రీ 567, సుమయ్యతస్లం 566, గీతాంజలి 559, నందిని 559, వై.నందిని 558, జానకీబాయి 556, సుష్మ 553, శ్రావ్య 551, ఆశీర్వాదమ్మ 550, త్రిష 549, మానస 549 మార్కులు సాధించారు. పాఠశాలలో 51 మంది విద్యార్థినులు 500కు పైగా మార్కులు సాధించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో ప్రిన్సిపాల్ సామ్రాజ్యం, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, పాఠశాల సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.



శ్రావణి 583/600



నందిని 576/ఙ600

ప్రజాపత్రిక ఆంధ్రజ్యోతి

- ప్రజాదరణతో మరింత చేరువ
- పాఠకుల్లో ప్రోత్సాహం కోసమే 'బైక్ అండ్ కార్ రేస్'
- విజేతలకు బహుమతి ప్రదానం



ప్రథమ విజేత వీరేష్‌కు బైక్ కొనుగోలు చెక్కును అందజేస్తున్న ఆంధ్రజ్యోతి కర్నూలు యూనిట్ సిబ్బంది

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అక్షరమే ఆయు ధంగా... ప్రజా సమస్యలే అజెండాగా... పాఠకుల ఆదరణ చురగొంటూ ఆంధ్రజ్యోతి పత్రిక దినదినాభివృద్ధి సాధిస్తోందని 'బైక్ అండ్ కార్ రేస్' విజేతలు కొనియాడారు. పాఠకులకు మరింత చేరువ కావడంతోపాటూ ఆంధ్రజ్యోతి కుటుంబంలో వారిని భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంగా ఆంధ్రజ్యోతి సంస్థ 'కార్ అండ్ బైక్ రేస్' లక్కీ డిప్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా చేపట్టింది. ఇటీవల కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆంధ్రజ్యోతి యూనిట్ ఆఫీసులో లక్కీ డిప్ ద్వారా జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి బైకు, ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్, తృతీయ బహుమతి కలర్ టీవీ విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ విజేత డి.వీరేష్‌కుమార్, ద్వితీయ విజేత పువ్వాడ శంకర నారాయణ, తృతీయ విజేత సి.వెంకటేశ్‌లకు బుధవారం బహుమతులను అందజేశారు.

(మిగతా 7లో)



ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్‌తో విజేత శంకర నారాయణ



తృతీయ బహుమతి కలర్ ఎల్ఈడీ టీవీతో విజేత వెంకటేశ్

ప్రసూతి మరణాలు జరగకూడదు

- కలెక్టర్ రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రసూతి మరణాలు సంభవించకుండా తల్లులకు సరైన సమయంలో వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రసూతి మరణాలకు సంబంధించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్టోబరు 22 నుంచి ఫిబ్రవరి 13 వరకు సంభవించిన 6 మాతృమరణాలకు సంబంధించి నివేదికలను పరిశీలిస్తూ మాతృ మరణాలు ఎలా జరిగాయి. వాటి కారణాలు ఎంటి అని కలెక్టర్ సంబంధిత వైద్యాధికారులను, ఏఎన్ఎంలను ఆరా తీశారు. గర్భిణులకు 8,9 నెలలో ప్రతి వారం పరీక్షలు నిర్వహించి వారు ఆరోగ్యంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మాతృ మరణాలకు సంబంధించి క్లిష్టమైన కేసులు ఏమైనా ఉంటే కమిటీ సభ్యులు ఆసుపత్రులను తనిఖీ చేసి వైద్య సిబ్బందితో మాట్లాడి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రసవానికి ముందు, ప్రసవం తర్వాత చికిత్స అందించడంలో వైద్యులు నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ, కమిటి సభ్యులు వైద్యాధికారులు, సీడీపీఓలు పాల్గొన్నారు.

ఏసీబీ డీఎస్పీగా సోమన్న

కర్నూలు క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఏసీబీ డీఎస్పీగా సోమన్నను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని నెలలుగా ఈ స్థానం ఖాళీగా ఉంది. 1991 బ్యాచ్‌కు చెందిన సోమన్నది అనంతపురం. ఇదిలా ఉండగా ఆయన కర్నూలు, కడప జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో పని చేశారు. ఇటీవల ఆదోని డీఎస్పీగా పని చేస్తూ హెడ్ క్వార్టర్‌కు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఆయనను కర్నూలు ఏసీబీ డీఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రోడ్డెక్కిన పొగాకు రైతు

- అమ్మేందుకు వెళ్తే నాణ్యత లేదంటూ వెనక్కి
- పొగాకును రోడ్డుపై వేసి నిప్పు పెట్టి నిరసన
- కేజీ రోడ్డుపె స్తంభించిన ట్రాఫిక్

వివరాలు 6లో

'బెల్టు' తెరిచారు..

ఆలోచింపజేసిన తరమెళ్లిపోతున్నది

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా వన్యప్రాణులకు రక్షణ కరువైంది. వేటగాళ్ల తుపాకులకు నిత్యం వన్యప్రాణులు బలైపోతున్నాయి. ముఖ్యంగా జింకలను చంపి, గుట్టు చప్పుడు కాకుండా వాటి చర్మం, మాంసాన్ని పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బడా బాబులు అయితే జింక మాంసంతో విందులు, వినోదాలు చేసుకుంటున్నారనే వదంతులు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎవరైనా సమాచారం ఇస్తేనే స్పందిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వన్య ప్రాణుల సంరక్షణకు కఠిన చట్టాలున్నా అవి అమలుకు నోచుకోవడం లేదని విమర్శలున్నాయి. ఆదోని, ఆలూరు, మంత్రాలయం మండలాల్లోని చాగి, నారాయణపురం, దానాపురం, ముసానహళ్లి, కాత్రికి, మనేకుర్తి, కమ్మరచేడు మర్కట్టు ప్రాంతాల్లో హైదరాబాద్‌కు చెందిన కొందరు వేటగాళ్లు కృష్ణ జింకలపై వేట సాగిస్తున్నట్లు సమాచారం.



వన్యప్రాణులపై తూటా!



- వేటగాళ్ల ఉచ్చులకు బలవుతున్న జింకలు
- జంతు సంరక్షణను గాలికొదిలేసిన అటవీ అధికారులు
- కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఆగని వేట

ఆదోని, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయి. కానీ అవి అమలు కావడం లేదు. జిల్లాలో ఎక్కడో ఒక చోట జింకలు వేటగాళ్ల తుపాకీ తూటాలకు మరణిస్తున్నాయి. 2022 మార్చి 7వ తేదీన హైదరాబాద్‌కు చెందిన వేటగాళ్లు, దుండగులు జీప్‌లో వచ్చి తుపాకులతో జింకల మందపై కాల్పులు జరిపారు. 12 జింకలు ప్రాణాలు కోల్పోయాయి. చనిపోయిన జింకల తలలు మొండాలను వేరు చేసి, మాంసంతో అక్కడి నుంచి వేటగాళ్లు ఉడాయించారు. అది మరవకముందే మరోసారి నారాయణపురం అడవుల్లో తుపాకుల శబ్దాలు వచ్చినట్లు స్థానికులు అంటున్నారు. ఈ ప్రాంతంలో వంకలు ఉండడంతో దాహం తీర్చుకునేందుకు వచ్చిన జింకల మందపై ఒక్కసారిగా తుపాకులతో కాల్పులు జరపడంతో మృతి చెందిన జింకలతో ఉడాయించారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పరిపాటిగా మారాయి.

● జింకల వేటలో

బడా బాబుల పుత్ర రత్నాలు..?

మార్చి నెలలో ఆదోని, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాలలోని పొలాల్లో 12 కృష్ణ జింకలను చంపిన ఘటనలో హైదరాబాద్‌కు చెందిన బడా బాబుల పుత్ర రత్నాలు ఉన్నట్లు సమాచారం. ఈ విషయం అటవీశాఖ అధికారులతో పాటు స్థానిక పోలీసులకు తెలియడంతో కేసు లేకుండా పైరవీలు సాగించినట్లు తెలుస్తోంది. తెలంగాణ ప్రాంతానికి చెందిన బడా నేతల పుత్రుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తిస్థాయిలో విచారణ చేస్తే నిందితుల వివరాలు బైట పడతాయని స్థానికులు అంటున్నారు.



● దొరికితే జైలు-జరిమానా

అటవీ జంతువులను పెంచుకోవడం, వేటాడటం నిషిద్ధం. వన్యమృగాలను చంపడం, వాటి మాంసం కలిగి ఉండటం నేరమని వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 చెబుతోంది. ఈ చట్టంలో ఇటీవల కొన్ని మార్పులు చేశారు. నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.50లక్షల వరకు జరిమానా విధించవచ్చు. ఈ రెండింటినీ ఏకకాలంలోనూ అమలు చేయొచ్చని అధికారులు పేర్కొంటున్నారు. అంతరించిపోతున్న వన్యప్రాణుల రక్షణకు ఈ చట్టాన్ని కఠినతరం చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. వాస్తవానికి గ్రామ పరిసరాల్లోకి అడవి జంతువులు వచ్చినా వాటికి హానీ తలపెట్టకూడదు. వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఈ విషయమై అటవీ అధిరాని తేజస్వినిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. మార్చి 6వ తేదీన కేసు నమోదు చేసామని, ఆ వ్యక్తి గన్నుతో దొరికాడని తెలిపారు.. జంతువులను వేటాడుతున్నట్టు తెలుసుకొని ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు అక్కడి నుండి పరారయ్యారని, వారికోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టామని అన్నారు. నిందితులు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు.



జింకల తలలను వేరు చేసిన దృశ్యం(ఫైల్‌ఫొటో)

రోడ్డెక్కిన పొగాకు రైతు

- అమ్మేందుకు వెళ్తే నాణ్యత లేదంటూ వెనక్కి
- పొగాకును రోడ్డుపై వేసి నిప్పు పెట్టి నిరసన
- కేజీ రోడ్డుపై స్తంభించిన ట్రాఫిక్
- రైతుల పట్ల వివక్ష చూపలేదన్న కంపెనీ ప్రతినిధులు



రోడ్డుపై పొగాకుకు నిప్పు పెట్టి నిరసన తెలుపుతున్న పొగాకు రైతులు

నందికొట్కూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు పొగాకు సాగు శాపంగా మారింది. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పొగాకును కొనుగోలు చేసేందుకు అలయన్స్ కంపెనీ అధికారులు నాణ్యత లోపాన్ని చూపుతున్నారు. వెనక్కి పంపుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రైతులకు తమ ఇష్టం వచ్చినట్లుగా ధరలో కోతలు విధిస్తూ అధికారులు తమకు తీరని అన్యాయం చేస్తున్నారని రైతులు రోడ్డెక్కారు. కొనుగోలు చేయాలని రైతులు నిలదీస్తే నాణ్యత లోపం ఉంది, ఇస్తే తక్కువ ధరకు ఇవ్వండి లేదంటే మీచావు మీరు చావండి అంటూ రైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని రైతులు ఆందోళనకు దిగారు. బుధవారం నందికొట్కూరు మార్కెట్ యార్డు సమీపంలోని గోదాము వద్ద తమకు మద్దతు ధర ఇవ్వలేదంటూ కేజీ రోడ్డుపై పొగాకు బేళ్లను వేసి నిప్పుపెట్టి రైతులు ఆందోళనకు దిగారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళనను విరమింపజేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కంపెనీ నిర్వాహకులు నాణ్యత పేరుతో తమకు తీరని అన్యాయం చేస్తున్నారని వాపోయారు. పొగాకు బేళ్లను తీసుకొచ్చిన ప్రతి సారి తమకు ధరలో కోతలు విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఇది ఒక్క రోజు మాత్రమే కొనుగోలు చేస్తామని కంపెనీ సిబ్బంది చెబుతున్నారని దీంతో తమ వద్ద ఉన్న బేళ్లను ఎవరు కొంటారని రైతులు వాపోతున్నారు. అనంతరం కంపెనీ అధికారులు రైతులతో మాట్లాడుతూ తాము మాత్రం నాణ్యతను బట్టి కంపెనీ నిబంధనల మేరకే ధరను నిర్ణయిస్తున్నామే తప్ప రైతుల పట్ల ఎలాంటి పక్షపాతం చేపడం లేదని అలయన్స్ కంపెనీ మేనేజర్ విజయ్ తెలిపారు.

ఆత్మహత్యలే శరణ్యం



అలయన్స్ కంపెనీ క్వింటాళ్లు పొగాకు రూ.15,500 కొనుగోలు చేస్తామని అగ్రిమెంట్ చేయించుకున్నారు. ఇప్పుడు నాణ్యత పేరుతో రూ.5 వేలకు కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. కౌలుకు తీసుకొని 30 ఎకరాల్లో చుక్కబర్లి పొగాకును సాగు చేశా. కౌలు, పెట్టుబడి అంతా కలిపి రూ.50లక్షలు ఖర్చు అయింది. ఇంతవరకు అమ్మిన పొగాకుకు రూ.6లక్షలు మాత్రమే వచ్చాయి. ఒప్పంద ధరకు పొగాకు కొనుగోలు చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం.

- రామకృష్ణ, రైతు, మిడ్తూరు

ఒప్పంద ధర కల్పించాలి



15 ఎకరాల్లో పొగాకు వేశా. ఇప్పుడు మూడో సారి వచ్చా. వచ్చిన ప్రతిసారి వెనక్కు పంపుతున్నారు. ఒప్పందం ప్రకారం రూ.15,500 ఇవ్వాలి. కాని ఇక్కడికి వచ్చాక రూ.5 వేలు మాత్రమే ధర వేస్తున్నారు. నాణ్యత లేదంటూ వెనక్కు పంపుతున్నారు. అలయన్స్ కంపెనీ సిబ్బంది కనికరించడం లేదు. కొనుగోలు చేయకపోతే చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకోనే పరిస్థితి.

-అలీమ్‌బాషా, చౌట్కూరు గ్రామం, మిడ్తూరు మండలం



రైతుల తీసుకొచ్చిన పొగాకు బేళ్లను ఎండలో వేసిన దృశ్యం

అడ్మినిస్ట్రేటర్‌కే ఎఫ్‌ఆర్‌ఎస్ బాధ్యతలు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు కచ్చితమైన వేళకు విధులకు హాజరయ్యేలా అమలు చేస్తున్న ముఖ ఆధారిత గుర్తింపు హాజరు (ఎఫ్ఆర్ఎస్) బాధ్యతలు ఇక నుంచి కర్నూలు జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ పి.సిందు సుబ్రహ్మణ్యం నిర్వహించనున్నారు. బుధవారం అడ్మినిస్ట్రేటర్ ఉద్యోగులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ఎఫ్ఆర్ఎస్ మెయిన్ అకౌంటును తీసుకున్నట్లు క్లర్క్ నుంచి పాస్‌వర్డ్‌ను తీసుకుని మార్పు చేసినట్లు తెలిపింది. కాంట్రాక్టు, ఏజెన్సీ ఉద్యోగులు 3 సార్లు కంటే ఆలస్యం గా వచ్చిన గైర్హాజర్ అయిన వారికి నోటీసులు లేదా సస్పెండ్ చేస్తామన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు మూడుసార్లు ఆలస్యంగా వచ్చిన వారికి కూడా ఖచ్చితంగా నోటీసులు జారీ చేస్తామన్నారు. సెలవులు మంజూరు విషయంలో స్క్రూటినీ చేసి హెచ్‌వోడీలతో మాట్లాడి ఎఫ్ఆర్ఎస్‌లో అప్రువల్ చేస్తానని తెలిపారు.

వ్యర్థానికి అర్థమేది..?



మున్సిపాలిటీలో మూలన పడేసిన జిరాక్స్ మిషన్

నంద్యాల టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. వాటి వల్ల భవిష్యత్తులో జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాత ఎలక్ట్రానిక్ వస్తువులను పురపాలక సంఘం ఆధ్వరంలో రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాలను నంద్యాలలో రెండు ఏర్పాటు చేశారు. కానీ నంద్యాల పురపాలక సంఘం కార్యాలయంలో మాత్రం పాడైపోయిన జిరాక్స్ మిషన్‌ను ఇలా ఒక మూలన పడేశారు. దీంతో ప్రజలు ఎలా పాత వస్తువులను ఇస్తారు. సంఘం వారే అవగాహన కల్పించాల్సింది పోయి వారే నిర్లక్ష్యంగా ఇలా చేయడం పలు విమర్శలకు తావిస్తోంది

ఆలోచింపజేసిన తరమెళ్లిపోతున్నది

● ఆసాంతం ఆకట్టుకున్న నాటక ప్రదర్శన ● టీజీవీ కళాక్షేత్రంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు



కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు



తరమెళ్లిపోతున్నదో నాటకంలోని సన్నివేశం

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సంబంధాల విచ్ఛిన్నంపై ఆలోచనాత్మకంగా సాగిన 'తరమెళ్లిపోతున్నది' సామాజిక నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గుంటూరుకు చెందిన కరణం సురేష్ మెమోరియల్ ఆర్ట్స్ సంస్థ కె.రామకృష్ణ దర్శకత్వంలో ఈ నాటకాన్ని ప్రదర్శించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం టీజీవీ కళాక్షేత్రంలో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ నాటకంలో రామకృష్ణ, డాక్టర్ శ్రీజ సాదినేని, కరణం సరిత, నల్లక శ్రీధర్, పోగతి నాగేశ్వరరావు నటించారు. సమకాలీన సమాజంలో అన్నదమ్ముల సంబంధాల్లోని సంక్షోభాలు ఇతివృత్తంగా సాగిన ఈ నాటకం ప్రేక్షకులను ఆలోచనలకు గురి చేసింది. కళాకారుల హావభావాలు, డైలాగులకు ప్రేక్షకులను ఆలరింపజేశాయి. అనంతరం కళాకారులకు టీజీవీ కళాక్షేత్రం తరపున అధ్యక్షులు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

అభివృద్ధి దిశగా రాష్ట్రం

- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వజ్రోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. భావి తరాలకు అభివృద్ధి ఫలాలు అందించాలన్న సంకల్పంతో పనిచేస్తున్నారన్నారు. చంద్రబాబు జన్మదిన వారోత్సవాలను పెద్దఎత్తున కళాకారులు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు ఇల్లూరి లక్ష్మయ్య మాట్లాడుతూ కర్నూలు అభివృద్ధి కోసం మంత్రి టీజీ భరత్ కృషి చేస్తున్నారని అన్నారు.

● నేడు సినిమా సంగీత విభావరి

చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాల్లో ఐదో రోజు సాయంత్రం 6 గంటలకు సినిమా సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. గజల్ గాయకుడు మహమ్మద్ మియా, గాయని సుధారాణి ఆధ్వర్యంలో ఈ సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

నేడు 'బొమ్మల గాథలు' పద్యకావ్యం ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కవి డి. పార్వతయ్య రచించిన 'బొమ్మల గాథలు' పద్య కావ్యం ఆవిష్కరణ సభ నగరంలోని టీజీవీ కళాక్షేత్రం సాహిత్య వేదిక హాలులో ఏర్పాటు చేసినట్లు సాహితీ స్రవంతి నగర కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంపీ బసవరాజు అధ్యక్షత వహిస్తారని, ప్రభుత్వ కళారత్న పురస్కార గ్రహీత విద్వాన్ పత్తి ఓబులయ్య పద్య కావ్యం ఆవిష్కరిస్తారని తెలిపారు. నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియా పుస్తక సమీక్ష చేస్తారని, ప్రధాన వక్తగా సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ ప్రసంగిస్తారని తెలిపారు.

గర్భిణులకు అవగాహన కల్పించాలి

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకంపై అంగన్‌వాడీ పరిధిలోని గర్భిణులకు అవగాహన కల్పించాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారి పి.నిర్మల సూచించారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకంపై కర్నూలు ఐసీడీఎస్ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల సీడీపీవోలు, సూపర్‌వైజర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకం ప్రయోజనాలు పొందేందుకు గర్భిణులు పేర్లను నమోదు చేసే సమయంలో ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా నమోదు చేయాలన్నారు. గర్భిణుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలను, సేవలను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి టి.శారద, కర్నూలు, నంద్యాల జిల్లాల సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'బెల్టు' తెరిచారు..

- విచ్చలవిడిగా దుకాణాలు
- కమీషన్ పెంచని ప్రభుత్వం
- రూ. వంద కోట్ల లక్ష్యం
- పావులు కదుపుతున్న ఎక్సైజ్ శాఖ
- మితిమీరిన రాజకీయ జోక్యం
- రూ.75 కోట్లు దాటిన అమ్మకాలు
- అవకతవకలకు అవకాశమే లేదు: డీసీ



కర్నూలు అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్ర జ్యోతి): మద్యం అమ్మకాలను పెంచేందుకు తెగబడ్డారు. దుకాణాలకు ఎక్సైజ్ శాఖ టార్గెట్లు నిర్దేశించడంతో అక్రమ మార్గాలకు తెరలేపారు. జిల్లాలో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలను తెరిచి అమ్మకాలకు తెగబడుతున్నారు. ఎప్పుడూ లేనివిధంగా గ్రామాలు, పట్టణాల్లో అమ్మకాలు చేపడుతున్నామని దుకాణదారులే చెబుతున్నారు. ప్రభుత్వం టెండర్ ప్రక్రియకు ముందు చెప్పిన కమీషన్ పెంచకపోవడంతో అమ్మకాలు చేపడితే తప్ప దక్కించుకున్న టెండర్ గిట్టుబాటు అయ్యే పరిస్థితులు లేవని తెగేసి చెబుతున్నారు. ఈక్రమంలో మద్యం అమ్మకాలపై ప్రభుత్వం ఈనెలకు వంద కోట్ల టార్గెట్ లక్ష్యంగా నిర్దేశించడం, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎలాగైన అమ్మకాల్లో లక్ష్యాన్ని పూర్తిచేయాలని పావులు కదుపుతోంది. టెండర్ ప్రక్రియలో మద్యం దుకాణాలను దాదాపుగా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, అనుచరులు దక్కించుకున్నారు. వారి అడ్డగోలు అమ్మకాలు, బెల్టుషాపులకు అడ్డుకట్ట వేయలేక ఎక్సైజ్, పోలీస్ శాఖలు తలలు పట్టుకుంటోంది. విచ్చలవిడిగా బెల్టుషాపులను ఏర్పాటుచేశారు. ఎక్కడ పడితే అక్క డ దుకాణాల వద్ద టెంట్లు వేసి సిట్టింగ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం అనధికారికంగా టార్గెట్లు విధించడంతో చేసేదేమీ లేక అమ్మకాలు అను కున్న లక్ష్యం చేరితే చాలు అన్న తీరులో కాలం వెల్లదీస్తున్నామని ఓసీఐ చెప్పడం కొసమెరుపు. ప్రతిరోజు బెల్టుషాపుల ద్వారా రూ.1.40 కోట్ల దాకా వ్యాపారం సాగుతు న్నట్లు ఎక్సైజ్‌శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలోని 109 మద్యం దుకాణాలు, 28బార్లు, 4 టూరిజం, క్లబ్బులాంటి వాటి ద్వారా బుధవారం నాటికి రూ. 76 కోట్ల మద్యం అమ్మకాలు జరిగనట్లు అధికారులు తెలిపారు.

నాణ్యమైన మద్యం విక్రయాలు..

ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని ప్రైవేట్ షాపుల ద్వారా విక్రయిస్తోంది. జిల్లాలో మొత్తం 109 బ్రాందీ షాపులు ఉన్నాయి ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే విక్రయాలు జరపాల్సి ఉంటుంది. అక్కడ మందు తాగేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయకూడదు. అన్ని రకాల మద్యం బ్రాండ్లను ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయించాలి. అంటే అక్కడ కొనుగోలు చేయడం. ఇంటికి వచ్చి తాగాలి. ఇందుకు గాను ప్రభుత్వం 14 శాతం లైసెన్సుదారులకు కమీషన్ ఇస్తుంది.

మామూళ్ల మత్తులో నియంత్రణాధికారులు..

బ్రాందీ షాపు కేవలం అమ్మకాలే జరగాల్సి ఉంటే అక్కడ పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసుకుని ఆడ్డగోలుగా తాపిస్తున్నా.. పోలీసు, ఎక్సైజ్ శాఖలు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. మద్యం అమ్మకాలు సక్రమంగా జరగడం, కల్తీ లేకుండా చూడడం, ఇతర ప్రాంతాల నుంచి మద్యం సరఫరా రాకుండా చూడడం కోసం ఎక్సైజ్ శాఖ లో ఎన్‌ఫోర్స్ మెంట్, టాస్క్‌ఫోర్సు, స్టేట్ టాస్క్‌ఫోర్సు బృందాలు ఉంటాయి. ఇవన్నీ ప్రభుత్వ నిబంధనల మేరకు అమ్మకాలు జరిగేలా చూడాలి. జిల్లాలో ఆ పరిస్థితి లేదు. నెలనెలా ఎక్సైజ్, సివిల్ పోలీసులు భారీగా ముడుపులు తీసుకుని బ్రాందీ షాపుల యాజమానులకు పూర్తిగా సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా బ్రాందీ షాపులు బార్లను తలపిస్తున్నాయి. సిట్టింగ్‌ల కోసం రేకుల షెడ్లు, దిమ్మెలు, కూర్చునేందుకు సీట్లు ఏర్పాటుచేసి తాపిస్తున్నారు. అయినా పోలీసులకు అవి కనిపించడం లేదు. షాపు స్థాయిని బట్టి ప్రతి నెలా రూ.వేలల్లో వసూళ్లు చేస్తున్నారనే విమర్శలున్నాయి.

భయాందోళనలో జనాలు

కర్నూలు నగర శివారులో గంజాయి బ్యాచ్‌లు, మందుబాబులతో జనం భయాం దోళనకు గురవుతున్నారు. గతంలో తాలుకా సీఐ గంజాయి బ్యాచ్‌పై కేసులు నమోదు చేసినా పరిస్థితుల్లో మార్పులేదు. దీనికి తోడు మద్యం దుకాణాల వద్ద తాగుబోతులు మద్యం మత్తులో నిత్యం హల్‌చల్ చేస్తున్నారు. దీంతో ఫ్యామిలీస్ అటు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దూపాడు వద్ద దేవుడి పేరుతో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం దుకాణాల్లో సిట్టింగ్‌లు ఏర్పాటుచేశారు. పంట పొలాలు నాశనమవుతున్నాయని కమ్యూనిస్టు పార్టీల నాయకులు గ్రామస్థులతో కలిసి ఎక్సైజ్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు.

నిర్దేశించిన ధరలకే అమ్మకాలు..



మద్యం అమ్మకాల్లో తేడా వస్తే ఉపేక్షించం. దుకాణాల్లో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ నిర్దేశించిన ధరలకే అమ్మకాలు జరగాలి. బెల్టుషాపులు కనిపిస్తే కఠినచర్యలు చేపడతాం. ఇప్పటికే ఎన్నో కేసులు నమోదు చేశాం.

- శ్రీదేవి, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ శాఖ

ప్రజాపత్రిక ఆంధ్రజ్యోతి

• ప్రజాదరణతో మరింత చేరువ • పాఠకుల్లో ప్రోత్సాహం కోసమే 'బైక్ అండ్ కార్ రేస్' • విజేతలకు బహుమతుల ప్రదానం



మూడో బహుమతి కలర్ టీవీని అందుకుంటున్న వెంకటేష్

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొదటి మూడు బహుమతులతో పాటు ఆకర్షణీయమైన వంద కన్సోలేషన్ బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఎ.లక్ష్మణ్ మాట్లాడుతూ పాఠకుల ఆదరాభిమానాలను చురగొంటూ ఆంధ్రజ్యోతి దినపత్రిక ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన, పక్కా సమాచారంతో వార్తలు ఇచ్చేందుకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి అనునిత్యం ముందుంటోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి కర్నూలు ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్‌కుమార్ నాయుడు, బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, ఏడీవీటీ మేనేజర్ జి.గోపాల్, సోనో విజన్ బ్రాంచ్ ఇన్‌చార్జి అచ్యుతరావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బహుమతులు అందుకున్న విజేతలు తమ ఆనందాన్ని ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

మరువలేని ఆనందం



ఆంధ్రజ్యోతి పాఠకుడిగా కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో ప్రథమ విజేతగా నిలిచి బైక్‌ను గెలుచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఫోన్ చేసి ఆంధ్రజ్యోతి లక్కీ డ్రాలో బైక్ గెలుచుకున్నావని చెప్పగానే నా ఆనందం మాటల్లో చెప్పలేకున్నాను. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి పత్రికను చదువుతున్నాను. వార్తలు చాలా బాగా వస్తున్నాయి. ఆ వార్తలే నన్ను ఆంధ్రజ్యోతికి మరింత చేరువ చేసింది. బైక్ కొనుగోలుకు సంబంధించిన చెక్కును అందుకోగానే చాలా సంతోషం అనిపించింది. థ్యాంక్యూ ఆంధ్రజ్యోతి.

- డి.వీరేష్‌కుమార్, వ్యాపారి, ప్రథమ విజేత, గూడూరు

పదేళ్లుగా ఆంధ్రజ్యోతి పాఠకుడిని



పదేళ్లుగా ఆంధ్రజ్యోతి పాఠకుడిగా ఉన్నాను. పత్రికలో ప్రతీ వారం ప్రచురితమయ్యే 'ఆర్కే కొత్తపలుకు' క్రమం తప్పకుండా చదువుతాను. నేను చిరుద్యోగిగా పనిచేస్తున్నాను. వార్తలు నాలో స్ఫూర్తిని రగిలించాయి. దమ్మున్న వార్తలు ప్రచురించడంలో ఆంధ్రజ్యోతికి మరోపత్రిక సాటిరాదు. ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో ఈ పత్రిక ప్రజల పక్షానే ఉంటుంది. అందుకే ఆంధ్రజ్యోతి అంటే ఎంతో ఇష్టం. కార్, బైక్ రైస్ లక్కీ డ్రాలో ద్వితీయ విజేతగా నిలిచి రిఫ్రిజిరేటర్ బహుమతిగా అందుకోవడం మరువలేని ఆనందాన్ని ఇచ్చింది.

- పువ్వాడ శంకర నారాయణ, ద్వితీయ విజేత, నంద్యాల

బహుమానం అమ్మకు ఇస్తా



ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రాలో జిల్లాలో తృతీయ విజేతగా ఎంపిక కావడం ఆనందంగా ఉంది. నాకు కలర్ టీవీ బహుమతిగా ఇచ్చారు. మా ఇంట్లో టీవీ ఉంది. మా అమ్మకు టీవీ లేదు. చాలా రోజుల నుంచి అమ్మకు ఒక కొత్త టీవీ కొనివ్వాలని అనుకుంటున్నాను. ఆంధ్రజ్యోతి బహుమతిగా ఇచ్చిన కలర్ టీవీని మా అమ్మకు బహుమతిగా ఇస్తాను. ఆరేళ్లుగా ఆంధ్రజ్యోతిని చదువుతున్నాను. జిల్లా పేజీలో వచ్చే వార్తలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. నిర్భయంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వార్తాకథనాలు ప్రచురించడం ఆంధ్రజ్యోతికే సాధ్యం. ఆంధ్రజ్యోతి మరింత అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నాను.

- సి. వెంకటేశ్, తృతీయ విజేత, కోడుమూరు

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



సాయి (ఫైల్)

ఆత్మకూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని పోస్టాఫీస్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. పోస్టాఫీస్ సమీపంలో సాయి(24) అనే వ్యక్తికి రెండేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ కలహాల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలోనే అతను ఏడాది పాటు కాశీలో ఓ స్వామిజీ వద్ద సాధనలో ఉంటూ వారం రోజుల క్రితం ఆత్మకూరుకు వచ్చాడు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన చావుకు ఎవరు కారణంగా కాదని తల్లి, తమ్ముడు క్షమించాలని సూసైడ్ లెటర్ రాశాడు. ఉదయాన్నే అతడు ఇంటి తలుపులు తెరవకపోవడంతో చుట్టుపక్కల వారు అనుమానం వచ్చి ఇంట్లోకి చూడగా ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారమివ్వగా ఏఎస్సై శంకరరెడ్డి ఘటనాస్థలికి చేరుకొని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు తల్లి కీర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భర్త వేధింపులతో వివాహిత...

ఓర్వకల్లు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని నన్నూరు మాలపేటలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. వివరాలు.. మాలపేటకు చెందిన బలగం అంజలి(25) ఇంట్లో బుధవారం ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తిరుమలేష్‌తో వివాహమై ఎనిమిది నెలలైంది. కొంతకాలం భర్త అన్యోన్యంగా ఉండేవాడని, ఇటీవలే వారి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. భర్త వేధిస్తుండటంతో తాళలేక ఉరేసుకొని మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఆలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఫెయిల్ అయ్యానని మనస్తాపంతో ఆలూరుకు చెందిన సిద్ధప్ప అనే విద్యార్థి బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులు ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు బళ్లారి ఆస్పత్రికి రెఫర్ చేశారు.

పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలి

• నీటి యాజమాన్య సంస్థ పీడీ వెంకటసుబ్బయ్య
• 'ఉపాధి' పనుల తనిఖీ



నీటి తొట్టిని పరిశీలిస్తున్న పీడీ వెంకటసుబ్బయ్య

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా జరిగే పని ప్రదేశాల్లో అన్ని వసతులు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య అన్నారు. బుధవారం మండలంలోని బాపనంతాపురంలో ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. పని ప్రదేశంలో మస్టర్లను పరిశీలించారు. మండుతున్న ఎండల దృష్ట్యా పని ప్రదేశంలో కూలీలు జాగ్రత్తలు పాటించాలని, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. రోజుకు రూ307 వేతనం అందేలా కూలీలకు కొలతలు కేటాయించాలని ఏపీవో నాగార్జునకు ఆదేశించారు. గ్రామంలోని పశువుల నీటి తొట్టిని పరిశీలించారు. ఆ తొట్టిలో ప్రతిరోజు నీటిని నింపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

ఉద్యోగ బాధ్యతల్లో బదిలీ సాధారణం

• సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధారాణి



బదిలీ అయిన న్యాయాధికారితో మహిళా న్యాయవాదులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ బాధ్యతల్లో బదిలీలు సర్వ సాధారణమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధారాణి అన్నారు. నంద్యాలలో విధులు నిర్వర్తిస్తూ జడ్జిల బదిలీల్లో భాగంగా విజయవాడకు బదిలీ అయిన రాధారాణికి నంద్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మహిళా న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాధారాణి మాట్లాడుతూ బెంచ్‌కి, బార్ సహాయ సహకారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుసేన్‌బాష, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి కృష్ణారెడ్డి, రామచంద్రరావు, ద్వారకనాథ్, రాజేశ్వరి, సౌజన్య చిన్నలింగమయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుతో లాభాలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైతులు పండ్ల తోటల సాగుతో లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కొత్త తోటల అభివృద్ధి కింద 1,940 హెక్టార్లలో ఉద్యాన పంటలు అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలను అమలు చేస్తున్నట్లు స్పష్టంచేశారు. ఎంఐడీహెచ్ కింద 890 హెక్టార్లు, ఆర్‌కేఈవై కింద 550హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం ఇచ్చిందన్నారు. వీటిని అధిగమిస్తామని తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో 500 హెక్టార్లలో ఆయిల్‌ఫాం పంటను సాగు చేస్తామని అర్హులైన రైతులను మే నెలా చివరిలోగా గుర్తిస్తామని స్పష్టంచేశారు.

జగన్‌ను జైలుకు పంపాలి

• కూటమి కక్ష సాధింపునకు పాల్పడదు
• గొడవలు సృష్టించేందుకు జగన్‌రెడ్డి కుట్రలు
• టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రజల సొమ్ము దోచేసిన ఆర్థిక ఉగ్రవాది వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బెయిల్ రద్దుచేసి జైలుకు పంపాలని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, ఈడీ వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. జగన్ దగ్గర పనులు చేసిన ఎంతో మంది అధికారులు వారి ప్రమేయం లేకుండా ద్రోహులుగా నిలబడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. వైసీపీలో మైనింగ్, మద్యం, ఇసుక, లిక్కర్ వంటి వాటిలో కోట్లాది రూపాయలు జగన్‌కు ముట్టచెప్పిడంలో వారి పాత్ర నేడు బయట పడటంతో వారు సిట్ అధికారుల ముందు ద్రోహులుగా నిలబడ్డారని తెలిపారు. గతంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఎన్నోసార్లు తెలుగుదేశం పార్టీ చెప్పిందని, అయినా కూడా వారు వైసీపీ కొమ్ము కాయడంతో పాటు తప్పిదాలకు పాల్పడంతో వారి పట్ల చట్టం తన పని తాను చేస్తోందని, ఎవరిపైన కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తీసుకోదన్నారు. జగన్‌లా చంద్రబాబు ఏనాడు కక్ష సాధింపులకు పాల్పడలేదని, మీరుచేసిన పాపాలు మిమ్ములను వెంటాడుతున్నాయన్న విషయాన్ని మర్చిపోవద్దని కోరారు. ప్రస్తుతం జగన్‌రెడ్డి రాష్ట్రంలో అల్లర్లు, గొడవలు, అరాచకాలు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని, ఇలాంటి వాడిని బయట తిరగకుండా ఈడీ వెంటనే అక్రమాస్తుల కేసులో బెయిల్ రద్దు చేయాలని కోరారు.

వేదవతికి నిధులు కేటాయించాలి

• ప్రాజెక్టు సాధన సమితి కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి • ఆలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల మహా ధర్నా



తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

ఆలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేదవతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, లేదంటే ఆలూరు ప్రాంతం ఏడారిలా మారిపోయే ప్రమాదం ఉందని వేదవతి ప్రాజెక్టు కార్యాలయం వద్ద వేదవతి ప్రాజెక్టు సాధన కోసం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదవతి ప్రాజెక్టును పూర్తి చేయాలని పాలకులు, ప్రభుత్వాలు అనుకోవడం లేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావడానికి రైతులు కలిసిరావాలన్నారు. 8 టీఎంసీలను సద్వినియోగం చేసుకునేందులకు వీలుగా అలుగు నిర్మాణంపై దృష్టి సారించి సుమారు 80వేల ఎకరాల ప్రతిపాదిత ఆయకట్టుకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం అందించారు. రాయసీమ జల సాధన కమిటీ నాయకుడు దశరథరామిరెడ్డి, సీపీఐ ఎంఎల్ నాయకులు సవారప్ప, పీడీఎస్‌యూ నాయకులు అఖండ, మునిస్వామిలు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం

• రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించి 28 మంది హిందువులను ఊచకోత కోయడం దారుణమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో విచారం వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో విహారయాత్రలకు వెళ్లిన వ్యక్తులపై విచక్షణారహితంగా దాడి చేయడం దారుణమన్నారు. అమాయకులను చంపడం దారుణమన్నారు. ఈ దాడుల్లో ఇద్దరు తెలుగు వారు మృతి చెందడం బాధాకరమన్నారు. ఉగ్రవాదుల అమానుష దాడిని ఖండిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం మంత్రి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబీకుల్లో మనోధైర్యం వీడరాదన్నారు. మానవత్వం ఉన్న ఎవరూ ఇలాంటి దాడులు చేయరన్నారు కూటమి ప్రభుత్వం ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలిస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ఐక్యంగా ఉండి దేశద్రోహులను కఠినంగా శిక్షిస్తుందన్నారు. ఇలాంటి దాడులు చేసిన ఉగ్రవాదులకు ఎన్డీయే ప్రభుత్వం గుణపాఠం చెబుతుందని మంత్రి అన్నారు.

దాడి పిరికిపంద చర్య

• నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో టూరిస్టులపై జరిగిన దాడి పిరికిపంద చర్య అని నంద్యాల డీసీసీ అధ్యక్షులు జె.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. బుధవారం నంద్యాలలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉగ్రమూక దాడిలో 30 మంది చనిపోవడం చాలా బాధాకరమన్నారు. ఇటువంటి చర్యలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారికి నష్ట పరిహారంగా రూ.కోటి చెల్లించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీరాజ్ దినోత్సవానికి ఎంపీడీవోలు, జడ్పీటీసీలు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న మంగళగిరిలో జరిగే పంచాయతీరాజ్ దినోత్సవానికి ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీడీవోలు, జడ్పీటీసీ, ఎంపీపీలు హాజరుకానున్నాట్లు జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే కార్యక్రమానికి కర్నూలు జిల్లా నుంచి ఎంపిడీవోలు-3, నంద్యాల జిల్లా-3, కర్నూలు నుంచి జడ్పీటీసీలు కర్నూలు-2, ఎంపిపీలు-3, ఎంపీటీసీలు-2, నంద్యాల జిల్లా నుంచి జడ్పీటీసీలు-2, ఎంపీపీలు-3, ఎంపిటీసీలు-2 హాజరు కానున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో తెలిపారు.

కఠినంగా శిక్షించాలి

• పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత
• మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్నఎమ్మెల్యే గౌరు చరిత, నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్ పహల్గాం, బైసాన్ సమీపంలో పర్యాటకులపై ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత డిమాండ్ చేశారు. ఉగ్రదాడిని ఖండిస్తూ చనిపోయిన వారిఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే నివాసం నుంచి అమ్మా హస్పిటల్ వరకు తనయుడు గౌరు జనార్ధన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కొవ్వొత్తులు వెలిగించి శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. టీడీపీ నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, కె.పార్వతమ్మ, ప్రభాకర్‌యాదవ్, బి.నాగిరెడ్డి, ఈవీ.రమణ, డి.రామాంజనేయులు, మాదేశ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కాటసాని ఆధ్వర్యంలో..

పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చెన్నమ్మసర్కిల్లో ర్యాలీ నిర్వహించారు. పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై జరిగిన దాడి దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఈదాడిలో ఏపీకి చెందిన చంద్రమౌళి, మధుసూదన్‌తో పాటు 28 మందిని కోల్పోవటం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉగ్రవాదుల నరమేధంపై కోటేష్ చిత్రం



నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ జమ్ముకశ్మీర్ సంఘటనపై స్పందించి ఉగ్రవాదుల నరమేధంపై చిత్రం గీశారు. కశ్మీర్‌లో ఉగ్రవాద భూతం విరుచుకు పడింది. 26 మంది భారతీయుల ప్రాణాలు కోల్పోయారు. సందడిగా వున్న ఆ ప్రాంతం ఒక్కసారిగా ఆర్తనాదాలతో దద్దరిల్లింది. ఉగ్రవాదుల తూటాల వర్షంతో 28 మంది పర్యాటకులు ప్రాణాలు వదిలారు. తన బిడ్డలు చూసి భారతమాత కన్నీరు పెడుతుంది. నెత్తురు మరిగిన రాక్షసులు. రక్తదాహం తీరలేదు. విగతజీవులుగా నెత్తురు మడుగులో వున్నారు. ఇకనైనా మన దేశం ఉగ్రవాదంపై దృఢంగా పోరాడాలి. ప్రాణాలు కోల్పోయిన వారికి కన్నీటి నివాళులు.

నర్సింగ్ స్టూడెంట్‌కు వేధింపులు

• సెక్యూరిటీ గార్డు తొలగింపు

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌లో క్లీనికల్ కోసం వచ్చిన ఓ ప్రైవేటు నర్సింగ్ స్టూడెంట్‌ను సెక్యూరిటీ గార్డు వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని బుధవారం నర్సింగ్ స్టూడెంట్ అధికారులకు ఫిర్యాదు చేసింది. రెండు నెలలుగా వేధిస్తున్నాడని, ఇన్‌స్టాగ్రాంలో పేరు నమోదు చేయాలని ఫోన్‌చేసి వేధిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్, నర్సింగ్ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్‌కు ఫిర్యాదు చేసింది. వేధింపులు తాళలేక చదువు మానేసి, స్వస్థలం కేరళకు వెళ్లాలనుకున్నానని ఫిర్యాదులో పేర్కొంది. స్పందించిన అధికారులు విచారణ చేసి సదరు సెక్యూరిటీ గార్డును విధుల నుంచి తొలగించారు.

అమ్మవారి విగ్రహం ఊరేగింపు



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బుధవారం సుంకులా పరమేశ్వరి దేవి విగ్రహాన్ని ఊరేగించారు. అమ్మవారికి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

తాగునీటి సరఫరా సమయం పెంచాలి: ఎమ్మెల్యే

కల్లూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీటి సరఫరా సమయం పెంచా లని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో తాగునీటి సమస్యపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. బుధవారం ఎమ్మెల్యే గౌరు చరిత అశోక్‌నగర్‌లోని పంప్‌హౌస్, మునగాలపాడులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. వేసవిలో ప్రజలకు తాగునీరు సక్రమంగా అందించడంలేదని మున్సిపల్ అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆమె సూచించారు. కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 8నుంచి 12 తరగతి విద్యార్థులకు వేసవి సెలవుల్లో వర్చువల్ విధానంలో వివిధ అంశాల్లో ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో నైపుణ్య శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులకు వేసవి సెలవుల్లో నైపుణ్య కోర్సును అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో శామ్యూల్‌పాల్, సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్, ఉపాధి కల్పనాధికారి సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

బైపీసీ విద్యార్థులకు అవకాశం

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బైపీసీ 2024లో పూర్తిచేసిన విద్యార్థులకు బీఎస్సీ, పారామెడికల్, నర్సింగ్, బీపీటీ, ఎంఎల్‌టీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 26 తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఈ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు సెల్ నెంబర్: 7995013422, 7680945357ను సంప్రదించాలని కోరారు.

పెద్దాసుపత్రిలో ఫైర్ సేఫ్టీపై మాక్ డ్రిల్

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఫైర్ సేఫ్టీ వీక్ సందర్భంగా బుధవారం మానసిక వ్యాధుల విభాగం వద్ద వైద్యసిబ్బందితో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం జరిగితే అగ్నిమాపక యంత్రాలు ఏ విధంగా ఉపయోగించాలో, ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డా.బీవీ రావు, అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.శివబాల, డా.కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రీబాయి, హౌస్ సర్జన్, శానిటేషన్ పాల్గొన్నారు.

బీడు భూములను గుర్తించండి

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో సాగుకు అనుకూలమైన బీడు భూములు వెంటనే గుర్తించాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి రామాంజనేయులు రైతు సేవాకేంద్రాల సిబ్బందికి సూచించారు. బుధవారం నగరంలోని ఉద్యాన భవన్‌లో కర్నూలు, కోడుమూరు డివిజన్లకు సంబంధించిన రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఉద్యాన పథకాలపై అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల సాగులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడు భూముల్లో ఉద్యాన పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఐడీఎహెచ్, ఆర్‌కేవీవై, ఆయిల్ ఫామ్, నేషనల్ బాంబో మిషన్ తదితర పథకాల ద్వారా రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించారు. ఉపాధి హామీ పథకం ప్లాంటేషన్ మేనేజర్ నంద కిషోర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 2400 హెక్టార్లలో ఉద్యాన రైతులను గుర్తించే కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది పూర్తి చేయాలన్నారు. కర్నూలు, కోడుమూరు డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

తిమ్మగురుడుస్వామి ప్రారంభ రథోత్సవం

గూడూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిమ్మగురుడు స్వామి జాతరలో భాగంగా బుధవారం స్వామివారి ప్రారంభ రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో స్వామి వారికి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారి సంపూర్ణ రథోత్సవానికి ముందు రోజు ప్రారంభ రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ ప్రారంభ రథోత్సవంలో భక్తులు పాల్గొని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, గ్రామ పెద్దలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వేలంలో రూ.21.42 లక్షల ఆదాయం

ఓర్వకల్లు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో వెలసిన చెన్నకేశవ ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన భూములకు చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవా రం ఈవోలు చంద్రశేఖర్ రెడ్డి, మద్దిలేటి ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఆలయాలకు సంబంధించిన 206 ఎకరాలకు వేలాలు వేయగా.. అందులో రూ.21.42లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గోవిందరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి భాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ముత్తకూరుకి చెందిన కేజీబీవీ విద్యార్థి శ్రావణి కుటుంబాన్ని ఆదుకోవాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేంద్రనాయుడు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

‘పది’లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

65.36 శాతం ఉత్తీర్ణత





ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఇందులో ప్రభుత్వ పాఠశా లల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఉత్తమ మార్కులు సాధించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 65.36 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఓంకార్ యాదవ్ తెలిపారు. మండలంలోని లొద్దిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి దొడ్డ దర్మసాయి 584/600 మార్కులు సాధించారు. అలాగే ఏపీఆర్ కాల్వబుగ్గ గురుకుల పాఠశాలకు చెందిన మహబూ బ్‌బాషా 587/600 మార్కులు సాధించారు. మోడల్ స్కూల్ చెందిన వెంకటగిరి అంజలి 573 మార్కులు సాధించారని తెలిపారు.

● ఏపీఆర్ కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు బుధవారం తెలిపారు. ప్రథమ స్థానంలో మహబూబ్‌బాషా 587, ద్వితీయ స్థానంలో ఉదయ్ కుమార్ మదన్ 586, తృతీయ స్థానంలో కిరణ్ 585 మార్కులు సాదించారు. 58 మంది విద్యార్థులు 580 పైగా సాధించారని తెలిపారు.

సి.బెళగల్: మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న మొత్తం 1,014 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 700 మంది ఉత్తీర్ణుల య్యారు. గత ఏడాది 42 శాతం ఉత్తీర్ణత సాధించిగా, ఈ ఏడాది 53.29 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని సంగాల ఉన్నత పాఠశాల విద్యార్థిని సుజాత 551 మార్కులు, బురాన్‌దొడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థి వినయ్ 548 మార్కులు సాధించినట్లు ఎంఈవో జ్యోతి తెలిపారు.

కల్లూరు: కల్లూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో 55.02 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని 18 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బాలురు-575, బాలికలు-590 మొత్తం-1105 మంది పరీక్షలకు హాజరుకాగా 608 మంది ఉత్తీర్ణత సాధించాలరని తెలిపారు. పెద్దపాడు మోడల్ స్కూల్ విద్యార్థినులు పి.షాజిదా-571, కె.దీపిక-566 మార్కులు సాధించారన్నారు.

గోరంట్ల గురుకులలో 94 శాతం ఉత్తీర్ణత

కోడుమూరు రూరల్: పదో తరగతి ఫలితాల్లో గోరంట్ల గురుకుల (బాలుర) పాఠశాల 94 శాతం ఉత్తీర్ణత సాధించింది. పాఠశాలలో 79 మంది పరీక్షలకు హాజరు కాగా 74 మంది ఉత్తీర్ణత లభించింది. అత్యధికంగా రాకేష్ అనే విద్యార్థి 580 మార్కులతో సాధించారు. అలాగే వర్కూరు ఉన్నత పాఠశాల 32 శాతం, పులకుర్తిలో 53 శాతం, అమడగుంట్లలో 34 శాతం, ప్యాలకుర్తిలో 50 శాతం, గోరంట్ల జడ్పీలో 52 శాతం, లద్దగిరిలో 31 శాతం, కల్లపరిలో 56 శాతం, కేజీబీవీలో 40 మందికి 25 మంది ఉత్తీర్ణులు కావడంతో 62 శాతం సాధించినట్లు ఎంఈవో తైమూర్‌బాషా తెలిపారు.



గురుకుల విద్యార్థి రాకేష్

గూడూరు: గూడూరు మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభను కనపరచారు. మండలంలో మొత్తం 386 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 214 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 62.25 ఉత్తీర్ణత శాతం నమోదు అయినట్లు మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ వెల్లడించారు. జులకల్ ఏపీ మోడల్ స్కూల్ 63శాతం, జడ్పీహె చ్ఎస్ మునగాల 78శాతం, జడ్పీహెచ్ఎస్(బాలురు)33శాతం, జడ్పీహెచ్ఎస్(బాలికలు)71శాతం, కెజీబీవీ గూడూరు 83శాతం, జడ్పీహెచ్ఎస్ చనుగొండ్ల 27శాతం, జడ్పీహెచ్ఎస్ గుడిపాడు 75శాతం, జడ్పీహెచ్ఎస్ పెంచికలపాడు 68శాతం ఉత్తీర్ణత సాధించి నట్లు ఎంఈవో తెలిపారు.

కేశవరెడ్డి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న విద్యాసంస్థల అధినేత కేశవరెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో కర్నూలు నగరంలోని వెంకటరమణా కాలనీలో కేశవరెడ్డి పాఠశాల ఐఐటీ, మెడిసిన్ ఫౌండేషన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈసందర్భంగా కేశవరెడ్డి పాఠశాలల వ్యవ స్థాపక అధ్యక్షుడు ఎన్.కేశవరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలోని ఐఐటీ, మెడిసిన్ ఫౌండేషన్ ద్వారా వేలాది మంది విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందిస్తున్నామన్నారు. పి.తన్మయ గాయత్రి 597/600 మార్కులు, షేక్ సుమేరా 595, ప్రవీణ్ కుమార్ రెడ్డి 595, వెంకట అభినవ్ 593, సోహినీ 593, కే.వైష్ణవి 593 మార్కులు సాధించారన్నారు. తమ సంస్థ నుంచి ఐఏఎస్, డాక్టర్లు, ఇంజనీర్లును తయారు చేస్తున్నామన్నారు.

మాంటిస్సోరి విద్యార్థులు..

కర్నూలు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు రాణించారు. పి.అఫ్రా అల్మాస్ 591, ఎస్ సాబాజ్ నేహాన్ 590, జి.సాయి చైతన్య 585 మార్కులు సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను కరస్పాండెంటు, ప్రధానోపాధ్యాయురాలు రమా జ్యోతి, కోఆర్డినేటర్ కళ్యాణి, లక్ష్మీకాంతరెడ్డి అభినందనలు తెలిపారు.

నారాయణ విద్యార్థులు..



విద్యార్థినిని అభినందిస్తున్న ఏజీఎం రమేష్ కుమార్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక కర్నూలు నగరంలోని నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పుంగూరి రమాదేవి విజయం సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని అభినందించారు. ఏజీఎం రమేష్ కుమార్, రామాంజనేయులు, అన్వర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో విద్యార్థులను అభినం దించారు. తమ పాఠశాల విద్యార్థులు వెంకట కీర్తన 597/600, రిజ్వానా 596, వర్షిణి 595, జలీల్ మహ్మద్ 595, సనా సమ్రీన్ 595, రిషిత సాయి 594, ఇమ్రాన్ నజీర్ 594 మార్కులు సాధించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శాంత, సత్యనారాయణ రెడ్డి, దినేష్ కుమార్, ఆల్తాఫ్ పాల్గొన్నారు.

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా రాజు యాదవ్



మంత్రి టీజీ భరత్‌ను సన్మానిస్తున్న రాజు యాదవ్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎంవీఎస్ రాజు యాదవ్ నియమితులయ్యారు. రాజు యాదవ్ గత ఇరవై ఏళ్ల నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. ఆయన పార్టీ కోసం సేవలను గుర్తించిన ప్రభుత్వం నూతన కమిటీలో చేటు కల్పించింది. ఆయన కలెక్టర్ రంజిత్ బాషా నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. తనపై పెట్టిన నమ్మ కాన్ని వమ్ము చేయకుండా ప్రజల కోసం కృషి చేస్తానని తెలిపారు. మంత్రి టీజీ భరత్‌ను ఆయన సన్మానించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

గూడూరు ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలో మట్టిపనులు చేస్తూ మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలో పర్యటించిన ఆయన భవన నిర్మాణ కార్మికులు మధు, సోమన్నకు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ కె.రామాం జనేయులు, రేమట వెంకటేష్, పౌలు, కౌన్సిలర్లు సురేష్, బుడ్డంగలి, కలాం ఉన్నారు.

మద్యం పట్టివేత

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరిలో ఎక్సైజ్ పోలీసులు బుధవారం మద్యం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు. వివరాలు.. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు తెలిపారు. దాడుల్లో రవి, రాజశేఖర్, లక్ష్మన్న అనే వ్యక్తుల నుంచి 8బీర్లు, 13 కేరళ మాల్ట్ విస్కీ, 15 బెంగళూర్ విస్కీ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేశామని అన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు చంద్రమోహన్, లక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీ హైస్కూల్ విద్యార్థులు..



విద్యార్థులను సన్మానిస్తున్న చైర్మన్ రామరాజు

కల్లూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కల్లూరు మండలం చిన్నటేకూరుకు చెందిన ఎస్వీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని సంస్థ చైర్మన్ బిఎంవీఎస్ రామరాజు తెలిపారు. బుధవారం వెలువడిన పది ఫలితాల్లో 93శాతం విద్యా ర్థులు ఉత్తీర్ణత సాధించారని, సి.శ్వేత-577, టి.అభిషేక్-573, వాసం తి-554, టి.చైతన్య-541, ఇ.మధులత-539, బి.సుమంత్‌యాదవ్-537, జాన్సీ-531, బి.ప్రశాంత్-518 మార్కులు సాధించారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులు, ఉపాధ్యాయులను చైర్మన్ అభినందించారు. డైరెక్టర్ సాలమ్మ, కరెస్పాండెంట్ రాఘవేంద్ర రాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సర్వేపల్లి విద్యార్థులు..

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్‌లోని సర్వేపల్లి పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ సాదించారనీ పాఠశాల డైరెక్టర్, కరస్పాండెంట్ శేషన్న, ప్రధానోపాధ్యాయురాలు కేపీ అరుణ, ఏవో దీక్షిత్ తెలిపారు. ఎస్.సమ్రీన్ 592/600, అఫీబ్ తస్రీన్ 578, సి.కృష్ణ 571 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, సహకారాలు అందించిన తల్లిదండ్రులకు అభినందించారు.

బాలభారతి పాఠశాల విద్యార్థులు..



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో మండల పొదుపులక్ష్మి ఐక్యసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలభారతి పాఠశాలలో బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సవ్య తెలిపారు. అందులో వంశీ 573/600 మార్కులు సాధించగా.. 11 మంది విద్యార్థులు 500కు పైగా ఉత్తీర్ణత సాధించా రని ప్రిన్సిపాల్ తెలిపారు. 30 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత అయినట్లు ఆమె తెలిపారు. కృషి చేసిన ఉపాధ్యాయులను మండల సమైఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి అభినందించారు.

ఉగ్రదాడిని ఖండించిన ఎంపీ నాగరాజు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఎంపీ బస్తిపాటి నాగరాజు ఖండించారు. 26 మంది ఉగ్రవాదుల చేతిలో మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందని, మృతుల్లో ఇద్దరు తెలుగు వారు ఉండటం బాధాకరమన్నారు.

కర్నూలు న్యూసిటీ: జమ్మూకాశ్మీర్‌లో పహల్గామ్ వద్ద పర్యాటకులపై జరిగిన దాడిని కిరాతకమైన చర్యగా అభివర్ణించవచ్చని మాజీ ఎమ్మెల్యే వైసీపీ పీఏసీ సభ్యుడు హఫీజ్ ఖాన్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాడిని ముష్కర మూకల పిరికిపంద చర్యగా పరిగణించాలన్నారు.

దాడిని ఖండిస్తున్నాం: జడ్పీ చైర్మన్: జమ్మూకాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గూడూరులో శాంతియుత ర్యాలీ

గూడూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో హిందువులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల శాంతియుత ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకుడు మల్లేష్ నాయుడు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టారు. ఉగ్రదాడిని ముక్త కంఠంతో ఖండిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో మీనుగ రాజేష్, వేల్పుల గోపాల్, నవీన్ వేదవ్యాస్, వెంకటేష్, రాము ఆనంద్ పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్ ఏఎస్‌వోగా వెంకటరాజు

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు అర్బన్ ఏఎస్‌వోగా వెంకటరాజు నియమితులయ్యారు. బుధవారం ఏఎస్‌వో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర జయంతిని అధికారికంగా నిర్వహించాలి

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జంగమ కులస్తుల ఆరాధ్య దైవం, సంఘ సంస్కర్త మహాత్మా బసవేశ్వర జయంతిని ప్రభుత్వం జిల్లాలో అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా జంగమ సంక్షేమ సంఘం నాయకులు, జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం నాయకులు కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కోరారు. కలెక్టరేట్‌లో ఆయన చాంబర్‌లో నాయకులు వినతిపత్రం అందజేశారు.

పదో తరగతి ఫలితాల్లో ‘రవీంద్ర’ ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జి.ధరణి 594, ఏ.తేజస్వి 594 మార్కులతో ప్రథమ స్థానం పొందగా.. ఎస్.కీర్తన 592, కే.పవన్ కుమారాచారి 591, మీనాక్షిబాయి 590, యశ్విత చౌదరి 590, శివసాయి కేశవ్ 590 మార్కులు సాధించారు. 550కి పైగా 77 మందికి, 500 పైగా 127 మంది, 450కి పైగా 161 మంది విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందనసభలో రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, అకడమిక్ అడ్వైజర్ డా.మమతా మోహన్, వైస్ చైర్మన్ వంశీదర్ పాల్గొని ప్రసంగించారు.

శ్రీచైతన్య విద్యార్థులు..



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం సురేష్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య పాఠశాలలకు చెందిన విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చినట్లు ఏజీఎం సురేష్ తెలిపారు. 597/600 మార్కులతో పాటు 596, 595, 594, 593, 592, 591. 590 మార్కులు విద్యార్థులు సాధించారన్నారు. 590 మార్కులపైన 35 మంది 580 మార్కులపైన 91 మంది, 575 మందిపైన 131 మంది, 550 పైగా 296 మంది, 500 మార్కులు పైగ 527మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, కోఆర్డినేటర్స్‌కు, డీన్స్‌కు ఏజీఎం సురేష్ అభినం దనలు తెలిపారు.

శ్రీనగర్ శ్రీచైతన్య పాఠశాలలో..



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుహాసిని, అధ్యాపకులు

శ్రీనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల కే-4 విద్యార్థులు పదో తరగతిలో దుమ్ము లేపారనీ ప్రిన్సిపాల్ సుహాసిని తెలిపారు. విరాట్ ప్రజ్వల్ 594/600 మార్కులు, సాదిక్ హుశేన్ 593, టి.విందు 590, హరిణి 589, హసీనా 589, కే.రీతు 589, కావ్య 588 మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సుహాసిని మాట్లాడుతూ మా విద్యాసంస్థల్లో అత్యంత అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతుందన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను ప్రిన్సిపాల్ అభినందించారు.

శ్రీలక్ష్మి పాఠశాల విద్యార్థులు..



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్ఆర్ పేటలోని శ్రీలక్ష్మి పాఠశాల విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన ఇల్లూరు బ్రాహ్మిణి 592/600, సి.కార్తిక 592, కే.లక్ష్మి 592, ఐమాన్ రాబీ 590 మార్కులు సాదించారు. అలాగే వంద మంది విద్యార్థులు 500మార్కులకు పైగా సాధించారరన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల యజమాన్యం అభినందించారు.

ప్రతిభ మోడల్ స్కూల్ విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సి.కల్పన 579/600, మమత 576, ఎస్.గంగోత్రి 567, సి.ప్రియాంక 563, వి.నందిని 562, ఎస్.కృపాసాగర్ 561, ఎస్.మధురవాణి 523, పి.హసన్‌వలి 518, కె.సాయిచరణ్ తేజ్ 518, కే.శ్యాంసుందర్ గౌడు 514, వేణు 511, కే.యశ్వంత్‌రాజ్ 508, స్పందన 509, సుమంత్ 507, వాణి 507, అజయ్‌కుమార్ 505 మార్కులు సాధించారు. ప్రతిభ విద్యార్థుల కృషిని తల్లిదండ్రుల ప్రోత్సాహాన్ని ఉపాధ్యాయుల సహకారాలు ఈ ఫలితాలు సాదించడానికి తోడ్పడ్డాయని పాఠశాల డైరెక్టర్ ఎం.అరుణాచలంరెడ్డి కరస్పాండెంట్ శ్రీదేవిని అభినందించారు. కార్యక్రమంలో సుబ్బయ్య, ప్రభాకరశాస్త్రి, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

‘గుడ్‌షప్పర్డ్’ విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో కల్లూరు మండలం విఠల్‌నగర్‌లోని గుడ్‌షప్పర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు రాణించారు. సాయిరుషి 587, సి.వైష్ణవి 582, ఎస్. సహీర్ అహమ్మద్ 572, జి.పూజిత 567 మార్కులు సాధించినట్లు పాఠశాల కరస్పాడెంట్ డి.మినెల్లా తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపకులను కరస్పాడెంట్ అభినందించారు.

కస్తూరి పాఠశాల విద్యార్థులు.. పదో తరగతి ఫలితాల్లో కర్నూలు తెలుగుగేరి కస్తూరి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. పి.వివేక్ 583, జి.పూజిత 582, కె.శ్రీనివాసులు579, వి.దివ్యతులసి 570 మార్కులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపకులను కరస్పాడెంట్ డి.మినెల్లా, ప్రిన్సిపాల్ అభినందించారు.

కాకతీయ పాఠశాల విద్యార్థులు..

కర్నూలు ఎడ్యుకేషన్: పదో తరగతి ఫలితాల్లో కాకతీయ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. డి.ప్రియాంక 556/600, ప్రసన్న లక్ష్మి 554, రేణుక 547 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ సుమతి, హెడ్ మాస్టర్ కే.రామస్వామిలు అభినం దించారు.

సీరాక్ పాఠశాల విద్యార్థులు..: పాతబస్తీలోని సీరాక్ ఆంగ్ల పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని కరస్పాండెంట్ జీఎండీ ఇబ్రహీం తెలిపారు. ఫాతిమా 594, సాత్విక్‌గౌడు 591, మహ్మద్ ఫహద్ 587, ఆలియా జైమా 585, నస్రీన్ 585 మార్కులు సాధించారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు వజీరా ఖాతూన్, మేరీ స్వప్న, రమేష్‌బాబు పాల్గొన్నారు.

తాగి నడిపితే కఠిన చర్యలు

ఆలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహబూబ్ బాషా హెచ్చరించారు. బుధవారం పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని, లారీ డ్రైవర్లు నిద్ర మత్తులో డ్రైవింగ్ చేయవద్దని సూచించారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించండి


కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

వెల్దుర్తి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, కార్యదర్శి కేశవరెడ్డి బుధవారం బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. మెడికల్ కిట్లు, తాగు నీరు, మజ్జిగ, పనిముట్లు ఇవ్వడం లేదని, టెంట్లు కూడా లేవని కూలీలు వాపోయారు. నబీ రసూల్, రాధాకృష్ణ, వెల్దుర్తి, డోన్ మండల కార్యదర్శులు కృష్ణ, నారాయణ, టెక్నికల్ అసిస్టెంటు చెన్నకేశవ, ఫీల్డు అసిస్టెంట్ కళ్యాణ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

'పది'లో 59 శాతం ఉత్తీర్ణత

దేవనకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో 59 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తిమ్మారెడ్డి తెలిపారు. అఖిల 556, విజయ్‌కుమార్ 561, నిజాముద్దీన్ 513 అత్యధిక మార్కులు సాధించారన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆదోని, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0లో భాగంగా గువ్వమ్మ సందు కొండల్లో సారా స్థావరాలపై దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్లా తెలిపారు. వివరాల మేరకు.. 500 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసి, 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. వాల్మీకినగర్‌కు చెందిన బోయ వెంకటేష్‌ను అదుపులోకి తీసకోగా, బుడ్డ తిమ్మప్ప పరారయ్యాడు. తదుపరి కుమ్మరిగేరికి చెందిన కిరాణా వ్యాపారి రాంప్రసాద్‌తో పాటు బుడ్డ తిమ్మప్ప మీద కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.


ఊటను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

చెత్త నుంచి సంపద సృష్టించాలి


సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

దేవనకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను వేరుచేసి సంపద సృష్టించాలని డీఎల్‌పీవో వీరభద్రప్ప సూచించారు. బుధవారం నెల్లిబండ సచివాలయాన్ని తనిఖీ చేశారు. పారిశుధ్యం, తాగునీరు, చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావాలన్నారు. ఎంపీడీవో సూర్యనారాయణ, కార్యదర్శులు ముని, నాగార్జున ఉన్నారు.

అవకాశాలను వినియోగించుకోవాలి

పత్తికొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు అవకాశాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే శ్యాం బాబు సూచించారు. బుధవారం ఎంపీడీవో గంగాభవాని ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రంలో దివ్యాంగులకు పరికరాలు అందించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు నమోదు చేసుకుని, నెలలోపే పరికరాలు అందిస్తామన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

పత్తికొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కుక్కను తప్పించబోయి కారు బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. కర్నూలు ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న శంకరమ్మ కుటుంబంతో బుధవారం ఉదయం కర్నూలు నుంచి మద్దికెరకు కారులో బయలుదేరారు. అయితే పత్తికొండ సమీపంలో పందికోన క్రాస్‌దాటాక కుక్క అడ్డురావడంతో దాన్ని తప్పించబోయి కారు అదుపుతప్పి రోడ్డుపక్కన గుంతలో బోల్తాపడింది. శంకరమ్మ చేతికి గాయాలు కాగా కొడుకు అఖిల్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరికి పత్తికొండ ఆసుపత్రిలో చికిత్స అందించారు.

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదులు హేయమైన చర్య అని బీసేపీ, జనసేన సంఘాలు నిరసన తెలిపాయి. జనసేన సమన్వయకర్త రాజశేఖ ర్ అధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు కరణం నరేష్, గోవర్ధన్ నాయుడు పాల్గొన్నారు. ఉగ్రదాడిని కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు ఖండించారు.

ఐరిష్, లైవ్ మస్టర్‌తో ఇబ్బందులు


గిరిగిట్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- హాజరు వేసేందుకు గంటల సమయం
- మండుటెండలో కూలీల అవస్థలు

తుగ్గలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కూలీల ఐరిష్ (కంటితో హాజరు) వేసేందుకు ఉపాధి కూలీలు పని చేశాక కూడా గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. అవినీతిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకంలో నూతన పద్ధతులు ఐరిష్, లైవ్ మస్టర్లు ప్రవేశ పెట్టింది. కొన్ని సమయాల్లో సిగ్నల్స్ అందకపోవడంతో కూలీలు గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. మండలంలో 18,707 జాబ్‌కార్డులు ఉండగా, ఈ ఏడాది 5వేల మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. ఈ ఏడాది కొత్తగా వచ్చిన ఐరిష్ లైవ్ మస్టర్లతో ఒక్కొక్క మస్టర్‌లో పని చేసే కూలీలు ఆన్‌లైన్‌లో లైవ్‌ఫోటో ఐరిష్ తీసుకోవాలంటే అరగంట పడు తుందని, ఒక్కో గ్రామానికి దాదాపు వంద మస్టర్ల ఉంటాయని, దీంతో గంటల తరబడి పని ప్రదేశంలో ఉండాల్సి వస్తోందిన కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పనికి ఉద యం 6 గంటలకు వచ్చామని, మధ్యాహ్నం 1 గంటైనా ఇంటికి వెళ్లే పరిస్థితి లేదంటున్నారు. మండుటెండలో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు పాత పద్ధతుల్లోనే హాజ రు వేయాలని కూలీలు కోరుతున్నారు.

ఐరిష్‌తో ఇబ్బందులు



ఐరిష్ తీయాలంటే ఒక్కో గ్రూపు వద్ద అరగంట సమయం పడుతుంది. అలా 20 నుంచి 30 గ్రూపుల ఫొటోలు తీయాలంటే నాలుగైదు గంటలు కూలీలు ఎదురు చూడాల్సి వస్తుంది. - బలరాం, మేటీ, గిరిగిట్ల

పాత పద్ధతిలోనే మేలు..



పాత పద్ధతిలో హాజరు వేస్తేనే మేలు. నెట్‌వర్క్ సమస్య ఉంటే ఐరిష్, లైవ్ మస్టర్లు వేయడం ఆలస్యం అవుతోంది. కూలీలు గంటల తరబడి ఉండాలి.
- అక్బర్ సీనియర్ మేటీ, చెన్నంపల్లి

పోషకాహార కిట్లు పంపిణీ

ఆదోని టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా బుధవారం ఏరియా ఆసుపత్రిలో క్షయ బాధితులకు పోషక ఆహార కిట్లను మధు ఆస్పత్రి యాజమాన్యం అందజేసింది. టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ శేఖన్ భాను మాట్లాడుతూ క్షయ నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఎంపీహెచ్‌యస్ బాబు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

29న ఆలయ భూముల కౌలుకు వేలం

మద్దికెర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చెన్నకేశవస్వామి ఆలయం భూములు 43 ఎకరాలను కౌలు చేసుకోవడానికి ఈ నెల 29న వేలం వేయనున్నట్లు ఈవో వీరయ్య బుధవారం తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో వేలాలు ఉంటాయని, పాటదారులు రూ.5వేల ధరావత్తు చెల్లించాలన్నారు. దక్కించుకున్న పాటాదారుడు వెంటనే మిగులు సొమ్మును చెల్లించాల్సి ఉంటుందన్నారు.

సత్తా చాటిన 'ప్రభుత్వ' విద్యార్థులు


సాకరే వర్ష(582)తో హెచ్ఎం, ఉపాధ్యాయుడు


శ్రీబాలాజీ (575), సరిత (570), రాఘవేంద్ర (560)

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాలల్లో ఆదోని నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలు సాధించారు. నియోజకవర్గంలో 23 ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత పాఠశాలలు ఉండగా, 2,415 మంది విద్యార్థులు పరీక్షలు 1,260 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆరేకల్లు బీసీ గురుకుల విద్యాలయానికి చెందిన విద్యార్థి వైష్ణవి 588, మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాకరే వర్ష 582, నెహ్రూ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీ బాలాజీ 575, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పావని 571, కస్తూరిబా గాంధీ జనరల్ పాఠశాల విద్యార్థిని సరిత 570, నందిని 560, ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థి రాఘవేంద్ర 560 మార్కులు సాధించారు.

పది పరీక్షల్లో 'కిడ్డీస్' ప్రభంజనం


సలీమా(597) కమ్మ హర్షిత (596) జయకృష్ణ (596) అష్రఫ్ బేగ్ (595)

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాల్లో కిడ్డీస్ విద్యాసంస్థలు ప్రభంజనాన్ని సృష్టించాయి. దేవనకొండ సలీమా 597 మార్కులతో రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచిందని పాఠశాల డైరెక్టర్లు కేశవ నారాయణ రెడ్డి, చిన్నపురెడ్డి తెలిపారు. అలాగే హుమైరా అష్రాఫ్ బేగ్ 595, సాధించగా, 596 మార్కులు పైగా సాధించిన వారు ముగ్గురు, 595పైగా మార్కులు సాధించిన 5, 590పైగా 24, 550పైగా మార్కులకు పైగా 161మంది, 500కి పైగా 208మంది సాధించారన్నారు.

ఉగ్రవాదుల దాడిపై నిరసన


ఆలూరులో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న వైసీపీ నాయకులు

ఆలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్‌లో పర్యాటకులపై దాడిని ఖండిస్తున్నామని వైసీపీ కన్వీనర్ మల్లికార్జున, మాజీ ఎంపీటీసీ భాస్కర్ అన్నారు. బుధవారం రాత్రి ఆలూరు అంబేడ్కర్ కూడలిలో వైసీపీ నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపి మృతి చెందిన వారికి నివాళులర్పించారు. హత్యాకాండకు పాల్పడిన దుండగులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్, రాజశేఖర్, వరుణ్, దానాల రాజు, పాల్గొన్నారు.

ఉగ్ర దాడిని ఖండిస్తూ ర్యాలీ

దేవనకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ దేవనకొండలో టీడీపీ, జనసేన, నాయకులు ర్యాలీ నిర్వహించారు. లౌకిక దేశంలో మతాన్ని ప్రేరేపించే పాక్ అగడాలను సహించేది లేదన్నారు. దేశ భద్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, ప్రభుత్వం ఉగ్రమూకలను అంతం చేయాలన్నారు. మృతులకు నివాళిగా ఉచ్చీరప్ప, శాంతాకుమార్, తదితరులు ఉన్నారు.

హత్యా రాజకీయాలు మానాలి

ఆలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): హత్యా రాజకీయాలు మానుకొని అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ ఒంగోలు మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి హత్యను ఖండిస్తున్నామ న్నారు. రాజకీయంగా ఎదుర్కొవాలే తప్ప హత్యకు పాల్పడవద్దన్నారు.


మాట్లాడుతున్న వైకుంఠం శివప్రసాద్

'మిల్టన్' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో మిల్టన్ పాఠశాల ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిల్టన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని కర్స్పాండెంట్ హెచ్.రమేష్ బాబు తెలిపారు. పాఠశాల టాపర్‌గా హర్షవర్ధన్ 592, మధు 588, జాహ్నవి 581 ద్వితీయ తృతీయ స్థానాలలో నిలిచారన్నారు. ప్రిన్సిపాల్ నాగరాజు, సీఈవో వెంకటేష్ మోహన్ రావు, గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

మద్దికెర టాపర్‌గా నవీన ప్రియ

మద్దికెర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో 446 మంది పరీక్షలు రాయగా 310 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఆదర్శ పాఠశాల విద్యార్థిని నవీన ప్రియ 567 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. ద్వితీయ స్థానంలో పారా సతీష్ కుమార్ (565), షాలినీ 560 మార్కులు సాధించారనీ ఎంఈవో రంగస్వామి తెలిపారు. ప్రిన్సిపాల్ సవిత, జ్యోతిరెడ్డి, దేవేంద్రప్ప, అజరయ్‌బాబు, బాలసునీత, ఎరవలి రామాంజులు విద్యార్థులను అభినందించారు.



మెరిసిన 'ప్రభుత్వ' విద్యార్థులు

ఆలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఆలూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి బి. కావ్య 585 మార్కులు సాధించి మండలం టాపర్‌గా నిలిచింది. ఆలూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1 విద్యార్థి శ్రీకాంత్ 577 మార్కులతో రెండో స్థానంలో నిలిచాడు. సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి సతీష్ కుమార్ 575, అరికెర గురుకులం రోహిత్ 564 మార్కులు సాధించారు. కస్తూర్బా విద్యార్థిని భువనేశ్వరి 532 మార్కులు సాధించింది. మండలంలో 51.29 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవోలు కోమల దేవి, చిరంజీవి రెడ్డి తెలిపారు


కావ్య(585)

అక్రమ కట్టడాలు తొలగించాల్సిందే

దేవనకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మనూర్లలో అంజనేయ స్వామి ఆలయ సమీపంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలని తహసీల్దార్ ప్రసాదురాజు హెచ్చరించారు. సర్వే నెం. 722లో గ్రామకంఠం భూమిలో ప్రభుత్వ అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు అక్రమంగా గుడిసెలు వేయడంతో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. బుధవారం తహసీల్దార్, సీఐ వంశీనాథ్ సిబ్బందితో చేరకుని ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని లేకుంటా, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ విజయబాస్కర్‌రెడ్డి, వీఆర్వో కౌలుట్ల తదితరులు ఉన్నారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

ఆలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ మహిళా అధ్యక్షురాలు కురువ శశికళ డిమాండ్ చేశారు. బుధవారం పెద్దహోతూరు గ్రామంలో పొగాకు రైతులతో మాట్లాడారు. వైసీపీ రైతు భరోసా పెట్టుబడి ఇచ్చిందని, దిగుబడిని ఆర్బీకే ద్వారా కొనుగోలు చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం రైతులను ముంచేసిందన్నారు.

సీపీఐ నాయకుడి వర్ధంతి



నినాదాలు చేస్తున్న గిడ్డయ్య, నాయకులు

ఆస్పరి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుష్పాలదొడ్డి గ్రామంలో సీపీఐ నాయకుడు బండమీద వెంకటేశ్వర్లు 41వ వర్ధంతి బుధవారం నిర్వహించారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ పీడిత ప్రజల బాంధవుడు సీపీఐ నాయకుడు వెంకటేశ్వర్లు పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. నాయకులు రాజా సాహెబ్ విరుపాక్షి, తిమ్మయ్య, నాగేంద్రయ్య, సురేంద్ర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'నేషనల్' విద్యార్థుల ప్రతిభ


రిత్విక సాయి(581), మన్విని (576), హాసిని(569)

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తమ విద్యార్థులు విజయఢంకా మోగించినట్లు నేషనల్ విద్యాసంస్థల అధినేత గోపాల్ రెడ్డి తెలిపారు. పాఠశాల టాపర్‌గా రిత్విక సాయి 581, ద్వితీయ స్థానంలో మనస్విని 576, తృతీయ స్థానంలో హాసిని, భాస్కర్ 569 నిలిచారన్నారు.

'పది'లో మెరిసిన అక్షరశ్రీ విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : తమ విద్యార్థులు మార్కుల ప్రభంజనాన్ని సృష్టించారని అక్షరశ్రీ పాఠశాల డైరెక్టర్ మేఘనాథ్ రెడ్డి తెలిపారు. 100% ఉత్తీర్ణతతో పాటు తమ విద్యార్థిని గౌతమి నంద 597 మార్కులు, దిశాగౌడ్‌కు 596, సంజన 595, మనస్విని 593/600, విజయ నాథ్ రెడ్డి 593, హర్షిత, లలిత, జస్వంత్, రోషన్ 592, జహ్రోకతీబ్ 591, ఆకాష్‌రెడ్డి 590 మార్కులు సాధించారని తెలిపారు.


గౌతమి నంద (597) దిశ గౌడ్ (596) సంజన సాకరే (595)

పత్తికొండ మండలంలో 68 శాతం ఉత్తీర్ణత


ప్రకాష్ (591). అస్సియాసుల్తానా(591), ప్రణయ్‌తేజ్ (591) సాదిక్ (568), సురేష్ (563), షైతాజ్ (564)

పత్తికొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షాఫలితాలలో పత్తికొండ మండలం 68 శాతం ఉత్తీర్ణతను సాదించింది. మొత్తం 1,105మంది పరీక్షలు రాయగా 751 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 580 మందికిగాను 348, బాలికలు 525కుగాను403 మంది ఉత్తీర్ణత సాధించారు సెయింట్ జోసఫ్ పాఠశాల ప్రణయ్ తేజ్(591), ఆస్పియా సుల్తానా(591) యశోదా పాఠశాల ప్రకాష్(591) సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు సాదిక్(568), సురేష్(563) బాలకోన్నతపాఠశాల విద్యార్థిని షైతాన్(564) మార్కులు సాధించారు.

మండల టాపర్లుగా జ్యోతిబా పూలే విద్యార్థినులు


జి.హాసిని (592) కేశమ్మ(590) అశ్రిత వర్షిణి(590)

వెల్దుర్తి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో మహాత్మా జ్యోతిబా పూలే విద్యార్థులు మండల టాపర్లుగా నిలిచారు. జి.హాసిని 592, టీ.కేశమ్మ 590, ఎం.అశ్రిత వర్షిణి 590 మార్కులు సాధించి మొదటి, రెండుస్థానాల్లో నిలిచారు. బి.దివ్య బాయి 584 (అంబేడ్కర్ గురుకులం), కె.కనిషా 584 (జడ్పీహెచ్ఎస్ గర్ల్స్) మూడో స్థానంలో నిలిచారు. జ్యోతిబా పూలే పాఠశాల 98.61 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానం, అంబేడ్కర్ గురుకులం 96.15 శాతంతో రెండో స్థానంలో నిలిచాయి. బీసీ హాస్టల్ 96.84, జడ్పీహెచ్ఎస్ (బాలికలు) 83.92 శాతం ఉత్తీర్ణత సాధించాయి. జడ్పీ బాలుర పాఠశాల 26.19 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచింది. మండలంలో 61.73 శాతం ఉత్తీర్ణత వచ్చింది. గతేడాది 45 శాతంగా ఉంది.

కలెక్టర్‌కు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు

- వంద శాతం ఉత్తీర్ణత సాధించిన జొన్నగిరి ఎస్సీ హాస్టల్ విద్యార్థులు


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు

తుగ్గలి , ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో తాము వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తామని జొన్నగిరి ఎస్సీ హాస్టల్ విద్యార్థులు కలెక్టర్ రంజిత్ బాషాకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. సెప్టెంబర్‌లో కలెక్టర్ రంజిత్ బాషా హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వందశాతం పాస్ కావాలని కలెక్టర్ కోరగా అందుకు విద్యార్థులు 22 మంది ఉన్నామని అందరం పాస్ అవుతామని హామీ ఇచ్చారు. శివప్రసాద్ నాయక్ 519 మార్కులు సాధింగా, 7మంది విద్యార్థులు ఫస్ట్‌క్లాస్‌లో, 13 మంది సెకండ్ క్లాస్‌లో ఇద్దరు థర్డ్ క్లాసులో పాసయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులను వార్డెన్‌రమేష్, విద్యాకమిటీ ఛైర్మన్ రవికుమార్ యాదవ్ అభినందిచారు.

స్వర్ణరథంపై ప్రహ్లాదరాయలు



స్వర్ణ రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహారించారు. బుధవారం చైత్ర దశమి శుభదినం ను పురస్కరించుకొని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టువస్త్రాలతో బృందావనాన్ని శోభాయమానంగా అలంకరించారు. భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల, విద్యుత్‌దీపాల మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణ ం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తికి ఊంజల సేవ నిర్వహించారు. మఠం పండితులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలి రావడంతో మంత్రాలయం కిక్కిరిసింది.

పత్తి రైతులకు అవగాహన

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో జరిగిన కిసాన్ మేళాలో పత్తి రైతులకు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులు పత్తి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. ముఖ్యంగా గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంచాలకులు జాన్సన్ వివరించారు. కార్యక్రమంలో రైతులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

'ఇటుకల బట్టీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారులకు పక్కనే ఉన్న ఇటుకల బట్టీల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ ఇటుకల బట్టీలతో ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆరోపించారు. ఇటుకల బట్టీల నిర్వాహకులపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విజయేంద్ర, నరసింహారెడ్డి, సుంకన్న, మధు, రాజు, నారాయణ పాల్గొన్నారు.

నేడు నిత్య పూజలకు విరామం

మంత్రాలయం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో గురువారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం,టెంకాయ కొట్టడం విరామం కల్పించనున్నారు. పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇస్తారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనంను భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే శ్రీ మఠం అధికారులు కల్పించనున్నారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, పండితులు, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసంను పాటిస్తారు.

కర్ణాటక మద్యం పట్టివేత.. మహిళపై కేసు

గోనెగండ్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్ననేలటూరు గ్రామంలో సుంకులమ్మ అనే మహిళ అక్రమంగా కర్ణాటక మద్యం అమ్మకాలు జరుపుతుండటంతో ఆమెను అరెస్టు చేసి నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు చిన్ననేలటూరుకి చెందిన సుంకులమ్మ కొంతకాలంగా మద్యం అమ్మకాలు జరుపుతుండేది. పోలీసులకు పక్కా సమాచారం రావడంతో బుధవారం ఆమె ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. 25 కర్ణాటక మద్యం బాటిళ్ల, పది ఆంధ్ర మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని సుంకు లమ్మపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ



మృతులకు నివాళిగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు

ఎమ్మిగనూరు టౌన్,ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడులను ఖండిస్తూ బుధవారం రాత్రి బీజేపీ కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టింది. సోమప్ప సర్కిల్ నుంచి శివసర్కిల్ వరకు కొవ్వొత్తులతో నిరసన తెలుపుతూ ర్యాలీ చేపట్టి ఆపార్టీ అసెంబ్లీ కోకన్వీనర్ తోగట నరసింహులు మాట్లాడారు. ఉగ్రదాడి పిరికి పంద చర్యగా వర్ణించారు. అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జగ్గాపురం ఈరన్న, కాసుల రాము, జెట్టప్ప, శివ పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం తోటల పరిశీలన



ఆయిల్‌ఫాంను పరిశీలిస్తున్న ఫ్రాన్స్, ఇండోనేషియా శాస్త్రవేత్తలు

పెద్దకడుబూరు , ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి సాగుచేస్తున్న ఆయిల్ ఫాం తోటలను విదేశీ శాస్త్రవేత్తలు నికోలస్ టర్నాబుల్, అంబ్రెప్యాబింగ్, శ్రీవిజయన్, రంగనాయకులు బుధవారం పరిశీలించారు. అతి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని ఇచ్చే పంట ఆయిల్ ఫామ్ తోటలని తెలిపారు. ఉద్యాన శాఖ నుండి వంద శాతం సబ్సిడీ ఇవ్వడంతో పాటు నాలుగేళ్ల వరకు సాగుకు అవసరమయ్యే ఖర్చులను సైతం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఉద్యాన శాఖ అధికారి అపర్ణ, హిందు, తెలుగు మహిళా అధ్యక్షురాలు నరవ శశిరేఖలు పాల్గొన్నారు.

బాలికలదే హవా..

- 'పది' ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ
- మండల టాపర్‌గా మోడల్ స్కూల్ విద్యార్థిని
- ద్వితీయ స్థానంలో కేజీబీవీ విద్యార్థిని



ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు

మంత్రాలయం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో 'పది' ఫలితాల్లో బాలికలదే హవా కొనసాగింది. ఏపీ రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో తలారి గీతాంజలి 544/600 మార్కులతో ప్రథమ స్థానం సాధించింది. చిలకలడోన కేజీబీవీ పాఠశాలలో జి.పూజిత 532 రెండో స్థానంలో, మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్.భానుమతి 531 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారనీ ఎంఈవోలు ఫైనుద్దీన్, రాగన్న, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసాద్, కేజీబీవీ ప్రిన్సిపాల్ శాంతి, మంత్రాలయం ఉన్నత పాఠశాల హెచ్ఎం హంపయ్య తెలిపారు. చిలకలడోన కేజీబీవీలో 38 మంది పరీక్షలు రాయగా.. 26 మంది పాసై, 12 మంది ఫెయిలై మండలంలో అత్యధికంగా 68 శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించారు.

మండలంలో 42శాతం ఉత్తీర్ణత



విద్యార్థి మహ్మద్ యాసిన్

కౌతాళం: పదవ తరగతి ఫలితాల్లో మండల విద్యార్థులు 42శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారులు రామాంజనేయులు, శోభారాణి తెలిపారు. 491 మంది బాలురు, 427 మంది బాలికలు మొత్తం 918 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 387 మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. మండల టాపర్‌గా బదినేహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మహ్మద్ యాసిన్ 566 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. కేజీబీవీ విద్యార్థిని రక్షిత 558 మార్కులతో మూడో స్థానాన్ని దక్కించుకున్నది.

పెరిగిన ఉత్తీర్ణత శాతం

ఎమ్మిగనూరు రూరల్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఈ ఏడాది మండలంలోని విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. గతేడాది కంటే ఈ ఏడాది పదవ తగరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కన బరిచారు. వాస్తవాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నప్పటికి విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరచడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 57శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 66.39 మంది విద్యార్థులు ఉత్తీర్ణత ను సాధించారు. ఎమ్మిగనూరు మండలంలోని గుడికల్లు పాఠశాలలో 121మందిగాను 70మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎర్రకోటలో 90 మందికి గాను 51, పార్లపల్లిలో 35 మందికి గాను 14, కడివెళ్ల ఉన్నత పాఠశాలలో 67మందికి గాను 46 మంది, దైవందిన్నెలో 145 మందికి గాను 74 మంది విద్యార్థులు, కొటేకల్లులో 78మందికి గాను 36 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే కడివెళ్ల మోడల్ స్కూల్‌లో 67మంది విద్యార్థులకు గాను 47 మంది విద్యార్థులు ఉత్తీర్ణతను సాధించి 69శాతాన్ని నమోదు చేశారు. ఇందులో ఆరు మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. అహ్మద్ సాదిక్ 565, నిఖిల్ కుమార్ 547 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

గోనెగండ్ల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు

గోనెగండ్ల: పదో తరగతి ఫలితాల్లో మండలంకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. 562 మంది విద్యార్థులకు గాను 283మంది విద్యార్థులు ఉత్తీర్ణీత సాధించారు. పరీక్షకు 246 మంది బాలురు హాజరు కాగా 112 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బాలికలలో 316 మందికి గాను 171 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. 55.77 శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్‌లో 94 మంది విద్యార్థులకు గాను 61 మంది విద్యార్థులు పాస్ ఉత్తీర్ణులయ్యారు. కులుమాల గ్రామాని కి చెందిన ప్రగతి 573 మర్కులు సాధించి ప్రథమస్థానం నిలిచారు. కేజీబీవీ పాఠశాలలో స్నేహ అనే విద్యార్థిని 568 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచారు. నందిని 563 మార్కులు సాధించి తృతయ స్థానంలో నిలిచారు. పెద్దనేలటూరు గ్రామంలో 56 మంది విద్యార్థులకు గాను కేవలం 15 మంది విద్యార్థులు మాత్రమే పాస్ అయ్యారు. కులుమాల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ప్రగతి అనే విద్యార్థిని 573 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఆనంద్, నరసమ్మకు ఒక కూతురు, ఒక కూమారుడు. ప్రగతి కులుమాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతుంది. దీంతో కులుమాల గ్రామస్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన ఉత్తీర్ణత శాతం



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కోసిగి: పదో తరగతి పరీక్ష ఫలితాలో ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం తగ్గింది. బాలురు ఉన్నత పాఠశాలలో 44శాతం ఉత్తీర్ణత సాధించి యు.తేజ 543 మార్కులు సాధించారు. కోసిగి బాలికలు ఉన్నత పాఠశాల 59.50 శాతం ఉత్తీర్ణత సాధించి 549 మార్కులు ఎం.చిన్మయశ్రీ పాఠశాల టాపర్‌గా నిలిచింది. దుద్ది జడ్పీహెచ్ఎస్ పాఠశాల 48 శాతం ఉత్తీర్ణతతో షేక్ అఫ్రీన్ 555 మార్కులు సాధించింది. ఏపీ మోడల్ స్కూల్‌లో 66.67 శాతం ఉత్తీర్ణతతో పి.వినయకుమార్ 546 మార్కులు సాధించాడు. మౌంట్ కార్మల్ ప్రైవేటు పాఠశాల 89.67 శాతం ఉత్తీర్ణతతో 570 మార్కులతో కుమ్మరి వెంకటేశ్ మండల టాపర్‌గా నిలిచాడు. మండలం నుంచి 800మంది పరీక్షలు రాయగా 450 మంది విద్యార్థులు పాసై 56.25 శాతం మండల ఉత్తీర్ణత శాతం నమోదైంది.

'పది' ఫలితాల్లో 66.39 శాతం ఉత్తీర్ణత

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు పరిధిలో పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి 66.39 శాతం ఉత్తీర్ణతను సాధించారు. బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఎమ్మిగనూరు ప్రాంతంలోని 16 ప్రభుత్వ, 14 ప్రైవేటు పాఠశాలల్లో పది పరీక్షలకు హాజరైన విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. మొత్తం 2505 మంది విద్యార్థులకు గాను, 1663 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

పదిలో మెరిసిన టైలర్ కుమారుడు



ప్రేమ్‌గణేష్

ఎమ్మిగనూరు పట్టణంలోని శివన్ననగర్‌లో నివసిస్తున్న శివశంకర్, శ్రావణిల కుమారుడు ప్రేమ్ గణేష్. శివశంకర్ మూడేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో తల్లి శ్రావణి చిన్నపాటి టైలరింగ్ పనులు చేస్తూ కుమార్తె, కుమారుడిని చదివిస్తోంది. ఆమె కష్టాన్ని కళ్లారా చూసిన కుమారుడు ప్రేమ్‌గణేష్ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 588/600 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత మార్కులు సాధించాడు. దీంతో ప్రేమ్‌గణేష్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, పాఠశాల సిబ్బంది అభినందించారు.

పెద్దకడుబూరు: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఆదర్శ పాఠశాలలో 84మందికి గాను 74మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే కస్తూర్బా పాఠశాలలో 41 మంది విద్యార్థినులకు గాను 38 మంది, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 80మందికి గాను 35 మంది, హెచ్. మురవణి పాఠశాలలో 59 మందికి గాను 26 మంది ఉత్తీర్ణత సాధించారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

రవాణా రంగాన్ని కొల్లగొట్టిన వైసీపీ

- స్థానిక డిపోలోని సమస్యలను పరిష్కరించాం
- కోడుమూరు రోడ్డుకు రూ.6 కోట్ల నిధులు
- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి
- రెండు బస్సులు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో రవాణారంగాన్ని వైసీపీ నాయకులు నాశనం చేసి కొల్లగొట్టారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో రెండు కొత్త బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల కాలంలో కొత్త బస్సుల కత దేవుడెరుగుకాని, ఆర్టీసి డిపోలో ఇంత చెత్త ఎత్తిపోసిన పాపాన పోలేదన్నారు. ఆర్టీసీని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్క ఎమ్మిగనూరు డిపోకు మాత్రమే 23 కొత్త బస్సులు తీసుకువచ్చినట్లు తెలిపారు. బెంగళూరు, హైదరాబాదు, అరుణాచలం, తిరుపతితో పాటు పలు సుదూరు ప్రాంతాలకు, అన్ని గ్రామాలకు పల్లె వెలుగు బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేశారన్నారు. స్థానిక డిపోలో ఉన్న సమస్యలన్నింటిని పరిష్కరించడంతో పాటు మరికొన్ని కొత్తబస్సులను కూడా తీసుకువస్తామన్నారు. ఎమ్మిగనూరు నుంచి కోడుమూరు రోడ్డు గుంతల మయంగా ఉండడంతో బస్సులు గంటల తరబడి ప్రయాణం సాగించాల్సి ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్డు మరమ్మతులు చేసి ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చేసిందన్నారు. తాజాగా కోడుమూరు రోడ్డుకు రూ.6కోట్లతో కొత్త రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, నాయకులు మిఠాయి నరసింహులు, రాందాసుగౌడు, ఆర్టీసి అల్తాఫ్, రంగన్న, ఉరుకుందు, మహేష్, రంగస్వామిగౌడు, రాజు, గుల్లా సలాం, బుగెడె నాగరాజు, కటారి రాజేంద్ర, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలి

సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు



మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : యాభై ఏళ్ల దాటిన ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పెన్షన్లు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని శివ సర్కిల్ ఆటో స్టాండ్ దగ్గర సీఐటీయూ నాయకుడు రాజుతో కలిసి ఆయన మాట్లాడారు. నిరంతరం ఆటోపై జీవనం గడుపుతున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులైన యువకులకు ఉద్యోగాలు కల్పించకపోవడంతో ఆటో కార్మికులుగా జీవనం చేస్తున్నారన్నారు. మే డే ను కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమోస్, శివ, నరసన్న గణేష్ పాల్గొన్నారు.

ప్రశాంత జీవితం గడపాలి : సీఐ

గోనెగండ్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఘర్షణలకు దూరంగా ఉంటూ ప్రశాంతమైన జీవితం గడపాలని సీఐ విజయ భాస్కర్ అన్నారు. బుధవారం సాయంత్రం పుట్టపాశం గ్రామంలో ప్రజలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో కొంతమంది ఘర్షణలకు ఉసిగొల్పుతారని, వారి మాటలు నమ్మరాదన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ విజయభాస్కర్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న రషీద్, రామకృష్ణ

ఎమ్మిగనూరు టౌన్,ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : సోమలగూడురుకు చెందిన అడ్వకేట్ ఆనంద్ రాజు అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రషీద్ అసోసియేషన్ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనంద్ రాజు కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. బార్ అసోసియేషన్ తరపున సహ కారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మెంబర్స్ రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

నందవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలగూడురుకు చెందిన న్యాయవాది ఆనందరాజు ఇటీవలే మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు దేశాయి మాదవరావు, వెంకటరామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, శ్రీధర్‌రావు, కడియాల పెద్దయ్య, మునిస్వామి రూ.30వేలు ఆర్థికసాయం అందజేశారు. మృతుడు ఆనందరాజు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, మహబుబ్‌బాసా, తిమ్మప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

గంధ లేపన సేవకు పేర్లను నమోదు చేసుకోవాలి

మంత్రాలయం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో ఈనెల 30న జరిగే అక్షయ తృతీయ వేడుకల్లో భాగంగా రాఘవేంద్రస్వామి శిష్య బృందావనాలకు నిర్వహించనున్న గంధ లేపన సేవకు భక్తులు పేర్లను నమోదు చేయించుకోవాలని మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేష్ జోషి తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈ నెల 30న ఏడాదికొకసారిగా జరిగే గంధ లేపన సేవకు శ్రీమఠం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా, ఆఫ్‌లైన్‌ద్వారా రూ.500లు రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సన్నక్కి నాలుగు సబ్జెక్టులో ఉత్తీర్ణత



వలస విద్యార్థిని సన్నక్కి చిన్నారి

కోసిగి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన మారెన్న, కమలమ్మ దంపతుల కుమార్తె పదో తరగతి విద్యార్థిని సన్నక్కి చిన్నారి. ఆమె తల్లిదండ్రులతో పాటు గుంటూరులో మిర్చి కోతకు వలస వెళ్లింది. రెండు పరీక్షలకు హాజరు కాకుండా కూలీ పని చేస్తుంది. 'ఆంధ్రజ్యోతి'లో 'పరీక్ష హాలులో కాదు.. వలస వెళ్లి మిర్చి పొలంలో' అనే శీర్షిక ద్వారా మార్చి 19న ఆంధ్రజ్యోతి ప్రధాన దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి గుంటూరు, కర్నూలు జిల్లాల కలెక్టర్లు ఆ వలస విద్యార్థిని సొంత గ్రామానికి తీసుకువచ్చి మిగిలిన నాలుగు పరీక్షలు రాయించారు. ఈ రాసిన నాలుగు పరీక్షల్లో ఆమె ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణులైంది. నాలుగు సబ్జెక్టుల్లో పాస్ కావడంతో విద్యార్థిని చిన్నారి హర్షం వ్యక్తం చేసింది. మిగతా రెండు సబ్జెక్టులను కూడా సప్లిమెంటరీలో రాసి ఇంటర్‌కు అర్హత సాధిస్తానని ఆమె చెప్పింది.

మహిళకు బ్యాగ్ అప్పగింత

- సత్వరమే స్పందించిన పోలీసులు



బ్యాగ్, సెల్‌ఫోన్‌ను మహిళకు అందజేస్తున్న ఎస్ఐ, పోలీసులు

మంత్రాలయం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బస్సులో బ్యాగ్‌ను పోగొట్టుకున్న మహిళకు పోలీసులు బ్యాగ్‌ను అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటకలోని బెలగాంకు చెందిన పవిత్ర దేశ్‌పాండే అనే మహిళ తన స్నేహితురాలితో కలిసి బుధవారం మంత్రాలయానికి వచ్చింది. బస్టాండ్‌లో బస్సు దిగి స్వామి దర్శనార్థం వచ్చింది. తన హ్యాండ్ బ్యాగ్ కర్ణాటక బస్సులోనే మరిచిపోయినట్లు గమనించింది. హుటాహుటిన స్థానిక పోలీసులకు ఆశ్రయించింది. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తన సిబ్బందితో బస్సు లొకేషన్‌ను పసిగట్టి తిరిగి మంత్రాలయం నుంచి బెలగాంకు వెళ్తున్న బస్సును వెంబడించి నిలిపి తనిఖీలు చేశారు. బస్సులో బాధితురాలు పవిత్ర దేశ్‌పాండే పోగొట్టుకున్న బ్యాగ్‌ను స్వాధీనం చేసుకొని ఆమెకు అప్పగించారు. అందులో సెల్‌ఫోన్, విలువైన బంగారు ఆభరణాలు, ఏటీఎం డెబిట్, క్రెడిట్ కార్డులు ఉన్నట్లు బాధితురాలు తెలిపింది. మంత్రాలయం పోలీసుల సేవలను కొనియాడుతూ సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఈ తనిఖీలో కానిస్టేబుల్ లక్ష్మన్నగౌడు, మహిళా కానిస్టేబుల్ నిర్మల పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

కోసిగి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఈసమావేశానికి కొన్నిశాఖల అధికారులు తప్ప అధిక సంఖ్యలో ఎంపీటీసీలు, సర్పంచులు సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోవడంతో తూతూ మంత్రంగా సాగింది. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండటంతో పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. అడిగిన వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఇన్‌చార్జి ఏపీవో ఖాళిక్ తెలిపారు. అలాగే రాయితీపైన వ్యవసాయ పనిముట్లు రైతులకు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి రాజు తెలిపారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో